# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...


విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 275 ఆదివారం 5 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


- ఎన్నికలలో ప్రధానంగా యువకులు నిర్ణయాత్మక శక్తిగా ఎదగడం విశేసం
- ఈ యువ ఓటర్ల చేతిలో కీలక నేతల భవిష్యత్
- గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.
- రాష్ట్రంలో మొత్తం 3 కోట్ల 30 లక్షల ఓటర్లు ఉంటే.. వారిలో 8 లక్షల కొత్తగా నమోదయిన యువ ఓటర్లు
- 2022లో టీఎస్పీఎస్సీ గ్రూప్-1, ఇతర నియామక పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ కావడం, పరీక్షల రద్దు బీఆర్ఎస్ పై ఆగ్రహానికి మరింత ఆజ్యం పోశాయి.
- జాబ్ క్యాలెండర్, ఇతర నిరుద్యోగ సమస్యలపై ఫోకస్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి
- కానీ బీఆర్ఎస్, బీజేపీలు పదేళ్ల కాలంలో నిరుద్యోగులను మోసం చేశాయనే భావనలో యువ ఓటర్లు.


# యువత ఎటు వైపు?




పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారం హోరెత్తుతోంది. మరో వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. గెలుపు ధీమాతో ఉన్న పార్టీలు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నా లు ముమ్మరం చేస్తున్నారు. అయితే తెలంగాణ ఎన్నికలలో ప్రధానంగా యువకులు నిర్ణయాత్మక శక్తిగా ఎదగడం విశేసం. ఈ యువ ఓటర్ల చేతిలో కీలక నేతల భవిష్యత్ తేలనుంది.

-6లో

## వచ్చేవారం పంట నష్టపరిహారం




- అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా మార్చిలో 10 జిల్లాల్లో 15,812 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు నిర్ధారణ
- నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.
- ప్రస్తుతం ఎన్నికలు ఉన్నందున పంపిణీకి కోడ్ అడ్డంకి
- ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాగానే పంపిణీ చేస్తామని ప్రకటన

హైదరాబాద్

పంట నష్టపరిహారం పంపిణీ విషయంలో కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్ర లేచింది. పరిహారం పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతించి రెండు వారాలు గడుస్తున్నా చలించని ప్రభుత్వం.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవడంతో ఎట్టకేలకు ముందడుగు వేసింది. వచ్చే వారం రైతులకు నష్ట పరిహారం ఇస్తామని ప్రకటించింది. -మిగతా3లో


## కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం



- ఈనెల తొమ్మిదో తేదీలోపు రైతుభరోసా డబ్బులు జమ చేస్తాం
- అలాగే, ఆగస్ట్ 15వ తేదీలోపు రుణమాఫీ కూడా చేస్తాం
- రైతు భరోసా ఏడు లక్షల 60 వేల మందికి ఇప్పటికే వేశాం
- మిగిలిన నాలుగు లక్షల మందికి వేస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది.. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాబోతున్నారు
- అందుకే ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఎక్కువ తలదూర్చను: రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్య
- ఖమ్మం జిల్లా పోరాటం, చైతన్యం, పట్టుదల కలిగినదని ప్రశంస
- ఉపముఖ్యమంత్రిపై ప్రశంసలు కురిపించిన సీఎం

ఖమ్మం

తెలంగాణలో ఎన్నికల వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రైతులకు శుభవార్త చెప్పారు. ఈనెల తొమ్మిదో తేదీలోపు రైతుభరోసా నిధులు జమ చేస్తామని రేవంత్ చెప్పారు. కాగా, ఖమ్మం జిల్లాలో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ..'ఎన్నికల వేళ సీఎం రేవంత్ కీలక ప్రకటన చేశారు. రైతులకు శుభవార్త అందించారు. ఈనెల తొమ్మిదో తేదీలోపు రైతుభరోసా డబ్బులు జమ చేస్తామన్నారు. అలాగే, ఆగస్ట్ 15వ తేదీలోపు రుణమాఫీ కూడా చేస్తామని ప్రకటించారు. రైతు భరోసా ఏడు లక్షల 60 వేల మందికి ఇప్పటికే వేశాం. మిగిలిన నాలుగు లక్షల మందికి వేస్తాం' అని కామెంట్స్ చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్..'ఖమ్మం జిల్లా దేశ రాజకీయాలకు దిక్సూచి. కేసీఆర్ నామా నాగేశ్వరరావును బకరాను చేస్తున్నారు. ఏ సంకీర్ణంలో చేరుతావు. ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటి మీద వాలితే కాల్చేస్తారు. నామాకు సూచన చేస్తున్నాను. కేసీఆర్ మాటలు వినకు. గత డిసెంబర్ మూడో తేదీన ఫలితాలు సెమీ ఫైనల్స్. ఇప్పుడు జరిగే ఎన్నికల్లో ఫైనల్ తీర్పు రాబోతుంది. గుజరాత్ టీమ్‌ను ఇంటికి పంపించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాబోతున్నారు' అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. అయితే, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సీఎం -మిగతా3లో



## కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ నయం..

- రేవంత్ రెడ్డిపై మోత్కుపల్లి నర్సింహులు కీలక వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డికి ఓటేస్తే నన్ను చంపినట్లే... మాదిగ బలమేంటో చూపిస్తాం
- కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు
- మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా
- మూడు ఎస్సీ రిజర్వ్ సీట్లలో కాంగ్రెస్ ఒక్కరికీ ఇవ్వలేదన్న మోత్కుపల్లి, మంద కృష్ణ


## రాష్ట్రం పరువు తీసేలా సీఎం రేవంత్ భాష

- కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు హామీలతో ప్రజల గుండెలు మండుతున్నయ్: హరీశ్ రావు
- సీఆర్ పాలనలో ఉన్నప్పుడు ఒక్క మోటర్ కూడా కాలలేదు
- కాంగ్రెస్ వచ్చాక మోటర్లు కాలిపోతున్నాయి
- ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నది.



హైదరాబాద్

కాంగ్రెస్ చెప్పినట్టు రాష్ట్రంలో మార్పు మొదలైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ వచ్చాక మళ్లీ తాగునీటి కొరత వచ్చిందని, ప్రజలకు నీళ్ల కష్టాలు మొదలయ్యాయని, విద్యుత్ సరఫరాలో మార్పు మొదలైందన్నారు. కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని, కాంగ్రెస్ 15 గంటల విద్యుత్ కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఉన్నప్పుడు ఒక్క మోటర్ కూడా కాలలేదన్నారు. కాంగ్రెస్ వచ్చాక మోటర్లు -మిగతా3లో



## అంతరిక్షంలో సూర్యాస్తమయం


- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి తీసిన ఫొటోను విడుదల చేసిన నాసా
- అధికారిక ఇన్ స్టా అకౌంట్లో పోస్టు
- భూమి, ఆకాశం నల్లగా.. వాతావరణం మాత్రం మెరిసిపోతూ ఆకట్టుకుంటున్న చిత్రం

# అంతరిక్షంలో సూర్యాస్తమయం

సూర్యోదయం, సూర్యాస్తమయం.. ఉభయ సంధ్యలను చూడాలని కోరుకోనివారెవరు? సూర్య నమస్కారాలతో ఉదయాన్ని.. సాయం సంధ్య వేళలలో యోగాతో రాత్రిని ఆహ్వానిస్తుంటారు కూడా. భూమ్మీద సూర్యాస్తమయాన్ని చూడటం సరే.. మరి అంతరిక్షంలోంచి చూస్తే ఎలా కనిపిస్తుందో తెలుసా?

**ఇన్ స్టా ఖాతాలో పోస్టు చేసిన నాసా..**

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా తాజాగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తీసిన ఫొటోను విడుదల చేసింది. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఐఎస్ఎస్ లోని ఓ వ్యోమగామి ఈ చిత్రాన్ని క్లిక్ మనిపించారు. తాజాగా నాసా దీనిని తమ అధికారిక ఇన్ స్టా అకౌంట్లో పోస్టు చేసింది. భూమి, ఆకాశం నల్లగా ఉండి.. భూమి నుంచి కిందికిపోతూ సగం మేర కనిపిస్తున్న



సూర్యుడితో ఈ చిత్రం ఆకట్టుకుంటోంది. సూర్యుడి కిరణాల ప్రభావంతో.. ఎగువన నీలి రంగులో, మధ్యలో తెల్లగా, దిగువన నారింజ రంగులో వాతావరణ పొరలు కూడా ఈ చిత్రంలో కనిపిస్తున్నాయి.

**నిజానికి సూర్యాస్తమయం కాదట**

ఇది నిజానికి సూర్యాస్తమయం కాదని నాసా పేర్కొంది. ఎందుకంటే భూమిపై 400 కిలోమీటర్ల ఎత్తున ఐఎస్ఎస్ అతి వేగంగా తిరుగుతూ ఉంటుంది. అది రోజుకు 16 సార్లు భూమిని చుట్టేస్తుంది. అంటే ఈ 16 సార్లు కూడా.. అందులోని వ్యోమగాములకు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు కనిపిస్తాయి మరి. వీటిని ఆర్బిటల్ సన్ రైజ్, ఆర్బిటల్ సన్ సెట్ గా పిలుస్తారని నాసా తెలిపింది. అలా ఓసారి సూర్యాస్తమయం అవుతుందగా ఈ ఫొటో తీసినట్టు వెల్లడించింది.

# రాజ్యాంగాన్ని మార్చే యత్నం

**మా అన్న యువరాజైతే ఆయన చక్రవర్తి..**

**మోదికి ప్రియాంక కౌంటర్**

**ప్రజల కోసం రాహుల్ 4,000 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే..**

**మోదీ తన రాజభవనంలో కూర్చుని రైతుల దుస్థితిని పట్టించుకోవడం లేదు**

**అధికారం ఆయన చుట్టూ ఉంది**

**ఆయన చుట్టూ ఉండే వాళ్లు ఆయనను చూసి భయపడిపోతుంటారు.**

**బనస్‌కాంత:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన సోదరుడు రాహుల్ గాంధీ ని యువరాజు గా సంబోధిస్తుండటంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రజల కోసం రాహుల్ 4,000 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే, ప్రధాని మోదీ తన రాజభవనంలో కూర్చుని రైతుల దుస్థితిని పట్టించుకోవడం లేదని గుజరాత్‌లోని బనస్‌కాంతలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ అన్నారు.

"నా సోదరుడిని ఆయన షెహజాదా అని పిలుస్తారు. నా సోదరుడు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేశ ప్రజలను కలుసుకున్నారు. వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. మరోవైపు, మన చక్రవర్తి నరేంద్ర మోదీ రాజభవనాల్లో ఉంటారు. నిస్సహాయ రైతులు, మహిళల అవస్థలు ఆయనకు



ఏ విధంగా అర్థమవుతాయి? అధికారం ఆయన చుట్టూ ఉంది. ఆయన చుట్టూ ఉండే వాళ్లు ఆయనను చూసి భయపడిపోతుంటారు. ఎవరూ ఆయనకు ఒక్క మాట కూడా చెప్పలేరు. ఎవరైనా ఒకవేళ తన గొంతు వినిపించాలనుకున్నా వారి గొంతు అణగదొక్కేస్తుంటారు" అని ప్రియాంక చెప్పారు. ప్రధానమంత్రి బడా వ్యక్తుల గురించే పట్టించుకుంటారు కానీ సామాన్య ప్రజానీకం గోడు ఆయనకు అక్కరలేదని ప్రియాంక విమర్శించారు. గుజరాత్ ప్రజలు మోదీని గౌరవించి ఆయనకు అధికారం కట్టబెట్టారని, కానీ ఆయన బడా వ్యక్తుల గురించే ఆలోచిస్తుంటారని అన్నారు. మోదీ కనీసం ఒక్క రైతునైనా కలుసుకోవడం మీరు ఎప్పుడైనా చూశారా? వారిని కలుసుకునే ప్రయత్నం కూడా చేయరు. ఎన్నికలు ముంచుకొచ్చి, తమకు ఓట్లు రావని తెలుసుకున్న తర్వాత ప్రధాని మోదీ చట్టాలను మారుస్తామంటున్నారని ఆక్షేపించారు.

**రాజ్యాంగాన్ని మార్చే యత్నం**

భారత రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కోరుకుంటోందని ప్రియాంక ఆరోపించారు. "ప్రజలకు రాజ్యాంగ హక్కులు ప్రసాదించింది. అన్నింటికంటే పెద్ద హక్కు ఓటు హక్కు. రిజర్వేషన్ హక్కుతో పాటు ప్రశ్నించే హక్కు, ఆందోళన చేసే హక్కు దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించింది. అందువల్లే రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇది కచ్చితంగా ప్రజల హక్కులను ఊడలాక్కోవడమే అవుతుంది" అని ప్రియాంక విమర్శించారు. ప్రపంచంలోనే విలక్షణ వ్యక్తిత్వం కలిగిన మహాత్మాగాంధీ ఈ గుజరాత్ గడ్డపైనే పుట్టారని, సర్దార్ పటేల్, వీర్ రాంచోడ్ రబ్రి కూడా ఇక్కడే జన్మించారని గుర్తు చేశారు. బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం కోసం ఎందరో గొప్ప వ్యక్తులు పోరాటం చేశారని, దేశ విముక్తి తర్వాత రాజ్యాంగాన్ని ప్రసాదించారని, రాజ్యాంగం గొప్పతనాన్ని అందరూ గుర్తించాలని కోరారు.

# ఓటుతో అవినీతిని నిర్మూలిద్దాం

**జార్ఖండ్ వేదికగా మోదీ ఘాటు విమర్శలు**

**ఒక్క ఓటు అవినీతిమయమైన కాంగ్రెస్‌ని అధికారం నుంచి తొలగించేలా చేసింది**

**జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయ్యేలా చేసింది**

**ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టింది**

లోక్ సభ ఎన్నికల వేళ అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పరస్పర ఆరోపణలతో రాజకీయాల్ని హీటెక్కిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ మే 4న జార్ఖండ్ పాలములోని ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్, జేఎంఎం నేతలపై మోదీ విరుచుకుపడ్డారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్క ఓటు అవినీతిమయమైన కాంగ్రెస్‌ని అధికారం నుంచి తొలగించేలా చేసిందని విమర్శించారు. అదే ఓటు.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిందని, జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయ్యేలా చేసిందని, ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టిందని అన్నారు. "ఇది అమరవీరుడు నీలాంబర్ పీతాంబరుడి భూమి.




2014లో మీ ఒక్క ఓటు ప్రజాస్వామ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. కాంగ్రెస్ అవినీతి ప్రభుత్వాన్ని తొలగించింది. మీ ఓటు విలువను గుర్తించండి. జార?ండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఆంధ్రప్రదేశ్‌లలో నక్సలైట్లు విస్తరిస్తున్నారు. వారి దాడుల్లో చాలా మంది తల్లులు తమ పిల్లలను కోల్పోయారు. మిగిలిన వారు ఆయుధాలు పట్టుకుని అడవి వైపు పరిగెత్తారు. నక్సలిజానికి ప్రభావితమయ్యారు. మీ ఓటు అలాంటి వారందరినీ రక్షించింది. వారి తల్లుల ఆశలను నెరవేర్చింది. 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న నేను ముఖ్యమంత్రిగా, ప్రధానిగా పని చేశాను. ఇప్పటివరకు నాపై ఎలాంటి అవినీతి మరక లేదు. నాకు సొంత ఇల్లు లేదు. సైకిల్ కూడా లేదు. అవినీతి జేఎంఎం, కాంగ్రెస్ నాయకులు తమ పిల్లల కోసం భారీగా అక్రమాస్తులు కూడబెట్టారు. అలాంటి వారికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. జార?ండ్‌లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి" అని మోదీ ప్రజలను కోరారు.

**2019 ఫలితాలు.. 2024 పోలింగ్ వివరాలు**

జార్ఖండ్‌లో 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2019లో బీజేపీ 11 సీట్లు, దాని మిత్రపక్షమైన AJSU ఒక స్థానాన్ని గెలుచుకుంది. మిగిలిన రెండింటిలో ఒకటి కాంగ్రెస్, మరొకటి JMM గెలుపొందాయి. రాజధాని రాంచీలో మే 25న పోలింగ్ జరగనుంది. జార్ఖండ్‌లో నాలుగు దశల్లో మే 13, 20, 25, జూన్ 1 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెల్లడికానున్నాయి.

## స్కూల్లో టీచర్, ప్రిన్సిపల్ డిష్యూం.. డిష్యూం



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఒకరినొకరు కొట్టుకున్నారంటే.. చిన్న పిల్లలన్న తర్వాత ఇదంతా సహజమని ఎవరైనా అంటారు. కానీ ఆ విద్యార్థులకే పాఠాలు చెప్పే టీచర్, ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఒకరినొకరు కొట్టుకుంటే.. దీనినే మనాలి. అటువంటి ఘటనే ఉత్తరప్రదేశ్‌లోని అగ్రాలో శుక్రవారం అంటే.. మే 3వ తేదీన చోటు చేసుకుంది. టీచర్ గుంజ చౌదరి.. పాఠాశాలకు ఆలస్యంగా వచ్చింది.

ఎందుకు ఆలస్యమైందంటూ ఆమెను ప్రిన్సిపల్ ప్రశ్నించారు. ఆ క్రమంలో ప్రిన్సిపల్‌గారు కూడా గత నాలుగు రోజులుగా పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నారంటూ సదరు టీచర్ వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. దీంతో అటు టీచర్, ఇటు ప్రిన్సిపల్ మధ్య మాట మాటా పెరిగి.. మాటల యుద్ధంగా మారింది. వారిద్దరు అక్కడితో ఆగకుండా.. ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అయితే అక్కడే ఉన్న తోటి టీచర్లు వారిద్దరిని.. వారించి.. విడదీసేందుకు ప్రయత్నించారు. అందుకు సంబంధించిన వీడియో.. సోషల్‌లో పోస్ట్ చేశారు. అయితే ఈ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. పాఠశాల టీచర్, ప్రిన్సిపల్ ఘర్షణపై నెటిజన్లు సైతం తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. మరోవైపు వీరిద్దరు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కి.. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో పోలీసులు సాధారణ కేసు నమోదు చేశారు.

## ప్రచారానికి డబ్బుల్లేవని టికెట్‌ను వెనక్కి ఇచ్చేసిన కాంగ్రెస్ అభ్యర్థి

**ఒడిశాలోని పూరి నుంచి బరిలోకి దిగిన సుచరిత మొహంతి**

**ప్రచారానికి నిధులు ఇచ్చేందుకు పార్టీ నిరాకరించిందంటూ కేసీ వేణుగోపాల్‌కు లేఖ**

**విరాళాలు సేకరించేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదని ఆవేదన**

**అందుకే పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటన**

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఎంతోమంది నేతలు పార్టీని వీడగా తాజాగా ఒడిశాలోని పూరి లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్న ఆ పార్టీ అభ్యర్థి సుచరిత మొహంతి తన టికెట్‌ను పార్టీకి వెనక్కి ఇచ్చేశారు. ప్రచారానికి అవసరమైన నిధులు తన వద్ద లేవని, పార్టీ కూడా తగినన్ని నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, ఖర్చులు తగ్గించుకున్నప్పటికీ ప్రచారం ప్రభావవంతంగా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "పార్టీ నుంచి నాకు ప్రచారం కోసం నిధులు అందలేదు. అసెంబ్లీ స్థానాల్లో బలహీన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చారు. డబ్బుల విషయంలో బీజేపీ, బీజేడీ ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో డబ్బుల్లేకుండా బరిలోకి దిగడం కష్టం. అందుకనే పోటీ నుంచి తప్పుకోవాలనుకుంటున్నాను" అని సుచరిత



తెలిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ) అభ్యర్థి పినాకి మిశ్రా చేతిలో సుచరిత ఓటమి పాలయ్యారు. తాను పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు చెబుతూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు సుచరిత లేఖ రాశారు. పార్టీ తనకు ఫండ్స్ ఇవ్వలేదని, రాష్ట్ర అధ్యక్షుడు అజోయ్ కుమార్ మాత్రం తననే సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టుకోమంటున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. నెలవారీ జీతంతో గడిపే జర్నలిస్టునైన తాను పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చానని గుర్తుచేశారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు, ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నించినా ప్రచారంలో నెగ్గుకు రాలేకపోతున్నట్టు సుచరిత తెలిపారు.

## ఢిల్లీలో కాంగ్రెస్‌కు షాక్, బీజేపీలో చేరిన ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు


ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన అర్విందర్ సింగ్ లవ్లీ శనివారం బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి సమక్షంలో కమలం గూటికి చేరారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. లోక్ సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీతో జతకట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని నాశనం చేయడానికే ఆమ్ ఆద్మీ పార్టీ ఉద్భవించిందని పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అయిన రోజున తనకు ఇష్టం లేకపోయినప్పటికీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆయన ఇంటికి వెళ్లినట్లు చెప్పారు. కాగా, అర్విందర్ సింగ్ లవ్లీ 2015లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. 2017లో బీజేపీలో చేరారు. తొమ్మిది నెలల తర్వాత బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు.

## ఉల్లి రైతులకు కేంద్రం తీపి కబురు!

**గతంలో ఉల్లి ఎగుమతులపై విధించిన నిషేధం ఎత్తివేత**

**అలాగే ఉల్లి ఎగుమతి ధరను టన్నుకు రూ. 45, 860 గా నిర్ణయించిన కేంద్రం**

**వచ్చే ఏడాది మార్చి వరకు 'దేశీ చనా' (బెంగాల్ గ్రామ్) కు దిగుమతి సుంకం నుంచి మినహాయింపు**



లోక్‌సభ ఎన్నికల వేళ ఉల్లి రైతులకు కేంద్రంలోని మోదీ సర్కార్ తీపి కబురు చెప్పింది. గతంలో ఉల్లి ఎగుమతులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన విడుదల చేసింది. అలాగే ఉల్లి ఎగుమతి ధరను టన్నుకు రూ. 45, 860 గా నిర్ణయించింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ఎక్సేంజ్ విడుదల చేసిన ఓ నోటిఫికేషన్‌లో ఉత్తి ఎగుమతి ధర 500 డాలర్లుగా పేర్కొనడం జరిగింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉల్లి రైతులకు మేలు జరగనుంది. ఇక విదేశాలకు ఉల్లి ఎగుమతిపై పూర్తి నిషేధం విధించిన కేంద్ర సర్కార్.. శ్రీలంక, యూఏఈ, బంగ్లాదేశ్ వంటి దేశాలకు మాత్రం పరిమితులతో కూడిన ఎగుమతులకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ఉల్లి ఎగుమతిపై నిషేధాన్ని పూర్తిగా ఎత్తివేయాలని ఉల్లి రైతులు, వ్యాపారులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహారాష్ట్ర ఉల్లి రైతులు ఈ డిమాండ్‌ను గట్టిగా వినిపించారు. అయితే, దేశంలో ఉల్లి ధరలు పెరుగుతాయనే కారణంతో ప్రభుత్వం నిషేధాన్ని అలాగే కొనసాగించింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'దేశీ చనా' (బెంగాల్ గ్రామ్) ఉత్పత్తులు తగ్గిపోవడంతో వీటికి వచ్చే ఏడాది మార్చి వరకు దిగుమతి సుంకం నుంచి మినహాయింపు ఇచ్చింది. గతంలో దేశ రాజధాని ఢిల్లీలో వీటి ధర క్వింటాల్‌కు రూ. 5,700తో పోలిస్తే 10 శాతం పెరిగి సుమారు రూ. 6,300కి చేరింది. అలాగే పసుపు బఠానీ దిగుమతి సుంకంపై ఇదివరకే జారీ చేసిన బిల్లు గడువు ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు పొడిగించింది.

## కాంగ్రెస్ రెండుగా చీలిపోతుంది..

**ఆచార్య ప్రమోద్ కృష్ణం జోస్యం**

**త్వరలోని రాహుల్ గాంధీ వర్గం, ప్రియాంక వర్గంగా కాంగ్రెస్ పార్టీ చీలిపోనుందని జోస్యం**

**పార్టీలో జరుగుతున్న 'కుట్రలో బాధితురాలు ప్రియాంక**

**కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో నైతకస్థైర్యం దిగజారింది**



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లోలో రాయబరేలి నియోజకవర్గాన్ని రాహుల్ గాంధీ ఎన్నుకోవడంపై ఆ పార్టీ బహిష్కృత నేత ఆచార్య ప్రమోద్ కృష్ణం సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోని రాహుల్ గాంధీ వర్గం, ప్రియాంక వర్గంగా కాంగ్రెస్ పార్టీ చీలిపోనుందని జోస్యం చెప్పారు. పార్టీలో జరుగుతున్న 'కుట్రలో బాధితురాలు ప్రియాంక అని వ్యాఖ్యానించారు.

**జూన్ 4 తర్వాత అగ్నిపర్వతం బద్ధలవుతుంది**

అమేథీ నియోజకవర్గాన్ని రాహుల్ గాంధీ విడిచిపెట్టిన తీరుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో నైతకస్థైర్యం దిగజారిందని ప్రమోద్ కృష్ణం అన్నారు. ప్రియాంక గాంధీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం ఆమె మద్దతుదారుల్లో ఒక అగ్నిపర్వతంగా రూపుదాల్చి జూన్ 4వ తేదీ తర్వాత బద్ధలవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి రెండుగా చీలిపోతుందని, ఒకటి రాహుల్ గాంధీ వర్గం, మరొకటి ప్రియాంక గాంధీ వర్గమని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో ఆయన (రాహుల్) పాపులారిటీ పెరుగుతున్నందున రాయబేరేలికి బదులుగా రావల్పిండి నియోజకవర్గాన్ని ఎన్నుకుని ఉండాల్సిందని ఆయన చురకలు వేశారు. ప్రియాంక గాంధీని ఎన్నికల్లో రాహల్ పోటీ చేయనీయడని తాను ఎప్పుడో చెప్పానని, పార్టీలోనూ, కుటుంబంలోనూ ప్రియాంక గాంధీకి వ్యతిరేకంగా భారీ కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఫ్యామిలీ, పార్టీ కుట్రలో ఆమె బాధితురాలిగా మారారని వ్యాఖ్యానించారు.

## రాహుల్ గాంధీ పేరుందని పోటీ చేయొద్దనలేం

**ఒకే స్థానం నుంచి ఒకే పేరున్న వారి పోటీపై బ్యాన్ విధించాలని పిటిషన్**

**డూప్లికేట్ అభ్యర్థులతో సెలబ్రెటీ నేతలను దెబ్బ కొట్టే ప్రయత్నం**

**ప్రత్యర్థులు వారిని స్వతంత్రులుగా బరిలోకి దింపుతున్నారని ఆరోపణ**

**పేర్లు ఒకేలా ఉండడంతో ఓటర్లలో కన్ఫ్యూజన్ నెలకొంటోందన్న పిటిషన్ దారులు**




ఒకే పేరున్న అభ్యర్థులు ఒకే నియోజకవర్గంలో పోటీపడడంపై నిషేధం విధించాలంటూ దాఖలైన అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఒకే పేరున్నంత మాత్రాన పోటీ చేయొద్దనలేమని తేల్చిచెప్పింది. ఈ పిటిషన్ ను విచారించలేమని స్పష్టం చేసింది. తల్లిదండ్రులు పెట్టిన పేర్లు వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎలా ఆపుతాయని పిటిషన్ దారులను ప్రశ్నించింది. ఒకవేళ ఎవరైనా రాహుల్‌గాంధీ, లాలూప్రసాద్ యాదవ్ వంటి పేర్లను పెట్టుకున్న వ్యక్తులను ఎన్నికల్లో పోటీ చేయొద్దంటే వాళ్ల హక్కులను అడ్డుకున్నట్లే అవుతుందని జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఎన్నికల్లో ప్రత్యర్థులను దెబ్బకొట్టి, తద్వారా తాము గెలిచేందుకు ఒకే పేరున్న అభ్యర్థులను రాజకీయ నేతలు వాడుకుంటున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలంటూ సాబు స్టీఫెన్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనివల్ల ప్రముఖ నేతలకు ఇబ్బంది కలుగుతోందని ఆరోపించారు. ఒకే పేరుండడంతో ఓటర్లు కన్ఫ్యూజన్ కు గురవుతున్నారని, తమ అభిమాన నేతకు ఓటేయడానికి బదులు డూప్లికేట్ వ్యక్తులకు ఓటేస్తున్నారని చెప్పారు. ప్రత్యర్థుల ఓట్లకు గండికొట్టడమే లక్ష్యంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న ఈ వ్యూహానికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఒకే పేరున్న అభ్యర్థులు ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేయకుండా నిషేధం విధించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించేలా సమర్థమైన పరిశీలన, తగిన వ్యవస్థను తీసుకురావాలని అభ్యర్థించారు. అయితే, ఎన్నికల్లో పోటీ చేయడానికి తల్లిదండ్రులు పెట్టిన పేరు అడ్డంకి కాబోదని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు ఈ పిటిషన్ ను విచారించలేమని స్పష్టం చేసింది.

## బీజేపీకి ఓటేస్తానన్న మహిళ.. చెంపదెబ్బ కొట్టిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి..

**ఆర్మూరు ప్రచారంలో ఉపాధి కూలిపై చేయిచేసుకున్న జీవన్‌రెడ్డి**

**అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసినా పెన్షన్ రాలేదని మహిళ ఆవేదన**

**ఈసారి పువ్వు గుర్తుకే ఓటేస్తానని చెప్పడంతో చెంపపై కొట్టిన జీవన్‌రెడ్డి**



కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి వివాదంలో చిక్కుకున్నారు. ప్రచారంలో భాగంగా నిన్న ఓ మహిళకు చెంపదెబ్బ కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆర్మూరులో ఇతర నేతలతో కలిసి ప్రచారం నిర్వహించిన జీవన్‌రెడ్డి ఉపాధి కూలి పనులు చేస్తున్న మహిళను సమీపించి ఈ ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తావని ప్రశ్నించారు. ఆమె వెంటనే 'పువ్వు' గుర్తుకు అని చెప్పింది. అసెంబ్లీ ఎన్నికల్లో తాను కాంగ్రెస్‌కే ఓటేశానని, కానీ పెన్షన్ రావడం లేదని, ఈసారి కమలం గుర్తుకే ఓటేస్తానని చెప్పింది. దీంతో జీవన్‌రెడ్డి ఒక్కసారిగా ఆమె చెంపపై కొట్టి ఏదో చెప్పడం వీడియోలో కనిపించింది. ఆయన చెంపదెబ్బ వేయగానే మిగతా నేతలు ఒక్కసారిగా నవ్వారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాకు ఎక్కడంతో వైరల్ అయింది. కాగా, నిజామాబాద్‌లో జీవన్‌రెడ్డికి ప్రత్యర్థిగా సిట్టింగ్ ఎంపీ, బీజేపీ నేత అరవింద్ బరిలో ఉన్నారు.

# కలిసి రాని కాలంతో తిప్పలు

**హైదరాబాద్ :** పాలకులు ఎంత సమర్థులు అయినా.. కాలం కలిసి వస్తేనే ప్రజలు, పాలకులు సంతోషంగా ఉంటారు. వనరులు పెరుగుతాయి. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కాలం కలిసిరానప్పుడు ఎంత చేసినా పాలకుల శ్రమ వృథా అవుతోంది. అప్పులు పెరుగుతాయి. ప్రభుత్వ ఆదాయం పడిపోతుంది. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దాదాపు పదేళ్లు రాష్ట్రం కరువుతో కొట్టుమిట్టాడింది. తాగు, సాగునీటి కొరతతో ప్రజలు అల్లాడారు. కరెంటు కోతలతో పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయి. అందుకే చంద్రబాబు పాలన అంటేనే కరువు అని అంతా భావిస్తారు. బాబు వస్తే కరువు వస్తుందంటారు. బాబు, కరువు కవల పిల్లలు అని వైఎస్ఆర్, జగన్ లాంటి వాళ్లు విమర్శిస్తూనే ఉండేవారు. చంద్రబాబు తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. ఆయన ప్రమాణస్వీకారం రోజే భారీ వర్షాలు కురిశాయి. దీంతో వరణుడు కాంగ్రెస్‌లో చేరారన్న ప్రచారం చేశారు ఆ పార్టీ నాయకులు.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లు మంచి వర్షాలే కురిశాయి. కరువు అంటేనే తెలంగు ప్రజలకు గుర్తొచ్చేది చంద్రబాబు పాలన. విభజిత ఏపీకి తొలి ముఖ్యమంత్రిగా కూడా చంద్రబాబు నాయుడే అయ్యారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నారు. ఆ సమయంలో కూడా వర్షాలు సాధారణంకన్నా తక్కువగా కురిశాయి. ఇప్పుడు దీంతో బాబు వస్తే కరువొస్తది అన్న నానుడి స్థిరపడింది. అయితే ఇప్పుడు చంద్రబాబు నాయుడు శిష్యుడి పాలన కూడా అలాగే



ఉందనిపిస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి అయ్యారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. పదేళ్లు బీఆర్‌ఎస్ పాలనతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఆ పాలన మారగానే కరువు అలుముకుంటోంది. ఇప్పటికే యాసంగి పంటలు సాగునీరు అందక ఎండిపోయాయి. కొంతమంది రైతులు పంటలను పశువులకు వదిలేయగా, మరికొందరు నిప్పు పెట్టారు.పదేళ్లు తెలంగాణలో తాగునీటి ఆందోళనలు కనిపించలేదు. నీళ్ల కోసం రోడ్లు ఎక్కిన సందర్భాలు చాలా తక్కువ. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ తాగునీటి సమస్య కూడా మొదలైంది. ఇప్పటికే రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు.

మిషన్ భగీరథ పథకం ఉన్నా.. నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. మంచినీళ్లు మహాప్రభో అని ప్రజలు మొత్తుకుంటున్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా ఫలితం ఇవ్వడం లేదు.ఇక చంద్రబాబు పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విపరీతమైన కరెంటు కోతలు ఉండేవి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా బాబు పాలన సాగించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా చంద్రబాబు శిష్యుడు రేవంత్ పాలనతోనూ కరెంటు కోతలు మొదలయ్యాయి. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ ఏం చేశారో తెలియదు కానీ కరెంటు సమస్య మాత్రం లేకుండా చేశారు. ఇప్పుడు మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయి. ఎక్కడా కరెంటు కోతలు లేవని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరేలా ఉంది.ఇక పదేళ్లలో ఎన్నడూ లేనంతగా తెలంగాణలో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే భానుడు భగ్గుమంటున్నాడు. ప్రస్తుతం మే నెల రావడంతో ఈ నెలంతా ఇంకా ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. చాలా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తున్నారు.దీంతో కరువు పాలనకు కేరాఫ్ చంద్రబాబే కాదు.. ఆయన శిష్యుడు కూడా అని కామెంట్ చేస్తున్నాయి విపక్ష బీఆర్ఎస్ నేతలు.

# రాష్ట్రం పరువు తీసేలా సీఎం రేవంత్ భాష

-మొదటి పేజి తరువాయి

కాలిపోతున్నాయని చెప్పారు.

'ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు తగ్గిపోయాయి. ప్రతిపక్షాలతో జైళ్లను నింపడంలో మార్పు మొదలైంది. కొత్త పథకాలు రాలేదు, ఉన్న పథకాల్లో కోతలు వచ్చాయి. ఆరు గ్యారంటీల్లో ఒక్కటైనా అమలయ్యిందా?. ఐదు గ్యారంటీలు అమలు చేశామని అబద్ధాలు చెప్తున్నారు. మొదటి గ్యారంటీ మహాలక్ష్మి అమలు చేశారా? రెండో గ్యారంటీ రైతులకు రుణమాఫీ, బోనస్ ఇచ్చారా?, మూడో గ్యారంటీ ఇంటి స్థలం ఎవరికైనా ఇచ్చారా? నాలుగో గ్యారంటీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు? ఐదో గ్యారంటీ చేయూత ఫెయిల్. గృహజ్యోతి కూడా పాక్షికంగానే అమలుచేశారు. 90 లక్షల మంది ఉంటే 30 లక్షల మందికి గృహజ్యోతి ఇచ్చారు. రైతులకు మోసం, మహిళలకు మోసం, పేదలకు మోసం. కాంగ్రెస్ మోసం చేయని మనిషి లేదు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నిలబెట్టుకోలేదు. అన్నవస్త్రాల కోసం పోతే ఉన్న వస్త్రాలు పోయినట్టయ్యింది. బాండ్ పేపర్ బౌన్స్ చేసిన కాంగ్రెస్‌కు శిక్ష వేయాలని ప్రజలు నిర్ణయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రామిసరీ నోట్లు.. ఇప్పుడు ప్రతి ఊరి దేవుడిపై ఓట్లు. బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారు. రైతుబంధు రాలేదంటే చెప్పుతో కొడతామని ఓ మంత్రి అన్నడు. మంత్రి తుమ్మలకే రైతుబంధు రాలేదన్నారు.

### రాష్ట్రం పరువు తీసేలా సీఎం రేవంత్ భాష

రాష్ట్రం పరువు తీసేలా సీఎం రేవంత్ భాష, వ్యవహార శైలి. రేవంత్ భాషను తెలంగాణ ప్రజలు అంగీకరించడం లేదు. తెలంగాణ సాధించిన కేసీఆర్ పట్ల రేవంత్ భాషను ప్రజలు ఆమోదించడం లేదు. యువతకు, భవిష్యత్ తరానికి రేవంత్ ఏం సందేశం ఇస్తున్నారు?. కేసీఆర్ చేసినవాటికి వ్యతిరేకంగా చేయడమే రేవంత్ ఉద్దేశం. కొత్త జిల్లాలను తీసేస్తామని రేంత్ అంటున్నరు. కొత్త జిల్లాల వల్ల పరిపాలన ప్రజలకు




అందుబాటులోకి వచ్చింది. రోజూ ప్రజలను కలుస్తానని చెప్పిన సీఎం.. మొదటి రోజు తప్ప మళ్లీ కనిపించలేదు. 3.50 లక్షల దరఖాస్తులు వస్తే ఎన్ని పరిష్కరించారో చెప్పలేదు. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నది. పార్టీలు మారినవారిని రాళ్లతో కొట్టాలన్న రేవంత్ ఇప్పుడు చేస్తున్నదేంటి?. పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పారు. కానీ, బీఆర్ఎస్ నుంచి చేర్చుకున్న ఎమ్మెల్యేలున్న వేదికపైనే మేనిఫెస్టో ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి. తెలంగాణలోని ఏడు మండలాలను, సీలేరు ప్రాజెక్టుని కేంద్రం ఏపీలో కలిపింది. బీజేపీ ప్రభుత్వం బిల్లు పెడితే కాంగ్రెస్ మద్దతిచ్చింది. దానిని బీఆర్ఎస్ వ్యతిరేకించింది. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కుట్ర చేస్తున్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలుంటేనే ఉమ్మడి రాజధాని కుట్రను అడ్డుకుంటారు.

### వడ్లు కొనడం చేతగాని బీజేపీ..

వడ్లు కొనడం చేతగాని బీజేపీ తెలంగాణలో ఓట్లు ఎలా అడుగుతుంది?. నూకలు బుక్కమన్న ఆ పార్టీకి తెలంగాణ రైతులు ఎందుకు ఓటు వేయాలి. బీజేపీ తెలంగాణకు ఏమిచ్చిందని ఓట్లు అడుగుతున్నది. బీజేపీ పాలనలో అదానీ ప్రపంచ కుబేరుడయ్యాడు. కేసీఆర్ కంటే ధార్మికుడు, భక్తుడు బీజేపీలో ఎవరూ లేరు. గతంలో దేవాలయాల నిధులు ఇతర అవసరాలకు వాడేవారు. కానీ, దేవాలయాలకు ప్రభుత్వ నిధులు ఇచ్చింది కేసీఆర్ మాత్రమే. బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చే అబద్ధపు హామీలతో ప్రజల గుండెలు మండుతున్నాయ్. కేసీఆర్ బస్సు యాత్రతో బీఆర్ఎస్‌కు అపూర్వ ప్రజాధరణ వస్తున్నది. మహిళలు, రైతులు, యువత కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్నారు. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం వస్తుంది. కాంగ్రెస్ బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు వస్తాయి.

### బీజేపీ గెలుపునకు రేవంత్ సహకారం..

రాష్ట్రం దివాళా తీసిందని ముఖ్యమంత్రి చెప్పవచ్చా. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. నిర్మాణరంగంపై ఆధారపడిన లక్షల మంది రోడ్డునపడ్డారు. రేవంత్ బీజేపీలో చేరుతారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. పార్టీ మార్పు విషయమై బీజేపీ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఎందుకు ఖండించడం లేదు. మోదీ ఆశీర్వాదం కావాలని రేవంత్ రెడ్డి కోరుతున్నారు. 8 సీట్లలో బీజేపీ గెలుపునకు రేవంత్ సహకరిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులు కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి. బీజేపీతో కలిస్తే జోడీ.. లేకుంటే ఈడీ. అక్రమ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు.

### అత్యధిక సీట్లు గెలుస్తున్నాం..

ముస్లిం మైనార్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ. మైనార్టీలకు అండగా ఉంటుంది. కేంద్రంలో ఈసారి వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. ఎక్కువమంది బీఆర్ఎస్ ఎంపీలుంటేనే తెలంగాణ కోసం కొట్లాడతారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవాళ్లను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. తాము అత్యధిక సీట్లు గెలుస్తున్నాం.. మాకు ఆ విశ్వాసం ఉంది. మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ అన్యాయం చేసింది. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మేనిఫెస్టోలో మాట కూడా లేదు' అని హరీశ్ రావు అన్నారు.

# కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ నయం

రేవంత్ రెడ్డికి (కాంగ్రెస్ పార్టీకి) ఓటు వేస్తే తనను చంపినట్లేనని... ముఖ్యమంత్రికి మన బలమేంటో చూపిద్దామని కాంగ్రెస్ పార్టీ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఒక్క మాదిగ సామాజిక వర్గానికి సీటు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత మోత్కుపల్లి పాల్గొని సొంత ప్రభుత్వంపై మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని.. ఆయన మాదిగల వ్యతిరేకి అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని.. దీంతో క్రమంగా మాదిగలకు ఆ పార్టీ దూరం అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్.. రెడ్డిల రాజ్యం తెస్తున్నారని మోత్కుపల్లి నర్సింహులు మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. 80 లక్షల మంది మాదిగలు ఓటు వేయకుండానే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ నయం అని అభిప్రాయపడ్డారు. మాదిగలకు టికెట్ ఇవ్వకపోవడంపై ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తానని ప్రకటించారు. మందకృష్ణ మాదిగతో కలిసి దీక్ష చేస్తానని తెలిపారు.

'నా అక్కాచెల్లెల్లందరికీ చెబుతున్నా... రేవంత్ రెడ్డికి ఓటేస్తే నన్ను మీరు చంపినట్లే. రేవంత్ రెడ్డికి ఓటేస్తే మీరు మోత్కుపల్లి నర్సింహులు చంపినట్లే. మీ కోసం నా జీవితం ఇస్తా. మీ కోసం నా ప్రాణం ఇస్తా. ఈ జాతి గౌరవం నిలబడాలి. మన బలమేంటో తెలియాలి. మాదిగ బలమేంటో మీకు చూపిస్తాం రేవంత్ రెడ్డీ' అన్నారు.


తెలంగాణలో మూడు ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో ఒక్క సీటు ఇవ్వని




కాంగ్రెస్ పార్టీకి మాదిగల బలాన్ని చూపించాలని హెచ్చరించారు. మాదిగల బలం కాంగ్రెస్ పార్టీకి తెలిసేలా చేస్తామన్నారు. తమకు గౌరవం ఇవ్వకపోతే కాంగ్రెస్‌ను పాతిపెడతామన్నారు. పుట్నాలు పంచితే ప్రజలు ఓటేశారనుకున్నావా? పుట్నాలకు ఆశపడే వాళ్లం కాదు... ఆత్మగౌరవం.. మా జాతి గౌరవం మాకు ముఖ్యమన్నారు. మాకు గౌరవిస్తే సహకరిస్తామని... గౌరవించకుంటే ఊరుకునేది లేదన్నారు.

మాదిగలు, బీసీలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఏనాడు లేనివిధంగా కాంగ్రెస్ మాదిగలను అవమానించిందన్నారు. తమ ఇందిరా పార్క్ దీక్షను పక్కదారి పట్టించేందుకు రేవంత్ రెడ్డి గాంధీ భవన్‌లో దళితుల ఆధ్వర్యంలో ధర్నా ఏర్పాటు చేశారని ఆరోపించారు. దేశంలో రాజ్యాంగానికి ఎలాంటి ప్రమాదం లేదన్నారు. మాదిగల ఓట్లతో కాంగ్రెస్ పార్టీకి మాత్రం ప్రమాదం ఉందన్నారు. మోదీతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ మూడోసారి ప్రధాని అయితే రాజ్యాంగానికి ఎలాంటి ప్రమాదం లేదని... కాంగ్రెస్‌కు మాత్రం ప్రమాదం ఉందన్నారు.

## వచ్చేవారం పంట నష్టపరిహారం పంపిణీ




-మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం కింద ఎకరాకు రూ.10 వేలు ఇచ్చినప్పుడు విమర్శించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు అదే 10 వేలు ఇవ్వడానికి ముందుకొచ్చింది. రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా మార్చిలో 10 జిల్లాల్లో 15,812 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ నిర్ధారించింది. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

### ఎన్నికల కోడ్ అడ్డం

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రులు తెలిపారు. ప్రస్తుతం కోడ్ అమల్లో ఉన్న కారణంగా పంపిణీ చేయలేకపోతున్నామని, ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాగానే పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ మే రకు అనుమతి కోరుతూ ఈసీకి ప్రభుత్వం లే ఖ కూడా రాసింది. స్పందించిన ఈసీ పరిహా రం పంపిణీకి అనుమతినిచ్చింది. ఇప్పటికే ప ది రోజులు గడిచినా ప్రభుత్వం మాత్రం పం పిణీకి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

### రూ.15 కోట్లు కూడా లేవా?

అకాల వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 15,812 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి రూ. 15.81 కోట్లు అవసరమవుతాయి. ఈసీ అనుమతినిచ్చినా ఇంకా పంపిణీ చేయకపోవడంతో ప్రభుత్వం మొత్తం ఈ కొద్దిపాటి మొత్తం కూడా లేదా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లేదంటే కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే పరిహారం పంపిణీ చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

## కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం

-మొదటి పేజి తరువాయి

రేవంత్ ఇలాంటి ప్రకటన చేయడం కోడ్ ఉల్లంఘనకు కిందకు వస్తుందని ప్రతిపక్ష పార్టీల నేతలు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే, ఎన్నికల్లో ఓట్లు పొందడం కోసమే రేవంత్ ఇలాంటి కామెంట్స్ చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అందుకే ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఎక్కువ తలదూర్చను

ఖమ్మం జిల్లా వారికి పట్టుదల, చైతన్యం ఎక్కువని, అనుకున్నదాని కోసం ఎంతదూరమైనా వెళతారని, అందుకే తాను ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఎక్కువగా తలదూర్చనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఖమ్మం జిల్లా ప్రజలపై, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కపై ప్రశంసలు కురిపించారు.

'ఉమ్మడి ఖమ్మం జిల్లా పోరాటం, చైతన్యం, పట్టుదల మిగతా తెలంగాణ ప్రాంతానికి ఆదర్శం. మా మిత్రుడు భట్టివిక్రమార్క గారితో అప్పుడప్పుడు నవ్వుతూ అంటుంటా... అయ్యా నాయనా ఎవరితోనైనా పెట్టుకోవచ్చు గానీ మీ ఖమ్మం జిల్లా వాళ్లతో పెట్టుకోవద్దు అంటుంటాను. ఎందుకంటే, మీరు అనుకున్నదాని కోసం ఎంత దూరమైనా వెళ్లి కొట్లాడుతారు. అందుకే నేను ఎప్పుడు కూడా ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఎక్కువ తలదూర్చకుండా దగ్గరగా ఉన్నట్లుగా ఉండి దూరం నుంచే నమస్కారం పెడుతుంటా' అని ముఖ్యమంత్రి అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కూడా ఢిల్లీ పెద్దలు ఓ మాట చెప్పారని, ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల్లో 22 జిల్లాలకు మాత్రమే ముఖ్యమంత్రివని, ఖమ్మం జిల్లాలో మాత్రం ప్రతి కార్యకర్త ఒక ముఖ్యమంత్రిగా ఉంటాడని, వారి సమస్యలపై వారే కొట్లాడుకుంటారని, వారికి వారే నాయకత్వం వహించుకుంటారని, వారికి వారే పార్టీని గెలిపించుకుంటారని నాడు చెప్పారన్నారు. మనం వారికి సహకరించాలి తప్ప ఎక్కువగా కలుగజేసుకోవద్దని నాడు వైఎస్‌కు ఢిల్లీ పెద్దలు చెప్పిన విషయాన్ని తాను కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ఢిల్లీ పెద్దలు అహ్మద్ పటేల్ చెప్పారన్నారు. 'ఖమ్మం జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. గొప్ప పోరాటపటిమ ఉంది. ఏ చైతన్యమైనా... ఏ రైతుకూలీ సమస్యపై పోరాటమైనా... రైతుల హక్కుల మీద, కార్మికుల హక్కుల మీద... ప్రపంచానికే ముందు నిలబడి ఈ ఖమ్మం జిల్లా కొట్లాడుతుంది. ఆనాడు 1969లో తెలంగాణ ఉద్యమం పాల్వంచ నుంచి ప్రారంభమైంది. ఆనాడు మీ బిడ్డ రవీంద్రనాథ్ మొట్టమొదట తెలంగాణ ఉద్యమం కోసం పునాది వేసి... జైతెలంగాణ నినాదాన్ని ప్రపంచానికి వినిపించిన ప్రాంతం పాల్వంచ... ఖమ్మం జిల్లాది. మీరు ఇచ్చిన స్ఫూర్తి, మీరు చేసిన పోరాటం వల్ల తెలంగాణ ఏర్పడింద'ని ఖమ్మం ప్రజలపై ప్రశంసలు కురిపించారు.

### భట్టివిక్రమార్కపై ప్రశంసలు

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కపై రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని మనకు అప్పగిస్తే భట్టివిక్రమార్క గట్టోడు కాబట్టి నిధులు సర్దుతున్నారన్నారు. అన్ని వర్గాల ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నట్లు చెప్పారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రిజర్వేషన్ల రక్షణకు సీఎం రేవంత్ రెడ్డి పోరాటం చేస్తున్నారు. తప్పుడు కేసులతో ఢిల్లీకి పిలిస్తే భయపడతామా?. రాజ్యాంగాన్ని కాపాడతామని రాహుల్ గాంధీ చెప్పిన మాటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. కాలం చెల్లిన థర్మల్ పవర్ స్టేషన్లను తిరిగి వాడకంలోకి తెస్తాం. కార్మికులకు రావాల్సిన లాభాలు ఇవ్వకుండా, సింగరేణికి బొగ్గు బావులు తవ్వకుండా గత ప్రభుత్వం 10 సంవత్సరాలు మొద్దు నిద్రపోయింది. సింగరేణి పరిసరాల్లోని బొగ్గు బావులన్నీ ప్రైవేటు వ్యక్తులకు కాకుండా సింగరేణికే చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. కొత్తగూడెంలో స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ తెరిపించి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తాం. రాబోయే ఐదేళ్లలో డ్వాక్రా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెప్పపాటుసేపు కూడా కరెంటు పోవడం లేదు. ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు పోతున్నాం. ఎన్ని అవరోధాలు ఎదురైనా ఆగిపోయే ప్రసక్తే లేదు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. రాహుల్‌ను ప్రధానిని చేయడానికి, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి రఘురామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి' అని కామెంట్స్ చేశారు.

## మే మండిపోతుందా...

**హైదరాబాద్ :** ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అని తేడా లేదు. ఎండలు బీభత్సంగా కొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇవాల్టితో పోల్చితే నిన్నే నయం అని అనుకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఏప్రిల్ నెలలో జమ్మూ కాశ్మీర్ నుంచి మొదలు పెడితే మేఘాలయ వరకు రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో బయటికి రావాలంటేనే ప్రజలు వణికి పోతున్నారు. ఏప్రిల్ నెల అలా ఉందంటే.. మే లో సూర్యుడు జనాలకు చుక్కలు చూపిస్తున్నాడు. ఉదయం 9 దాటితే చాలు రోడ్లమీద అనధికార కర్ఫ్యూ వాతావరణం నెలకొంటోంది. ఇక దేశవ్యాప్తంగా వడ దెబ్బకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. మే నెల ప్రారంభమై శుక్రవారం నాటికి మూడు రోజులు. ఈ మూడు రోజుల్లోనూ ఎండలు రికార్డు స్థాయిలో దంచి కొట్టాయి. అయితే వచ్చే రోజుల్లోనూ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.ఈ ఏడాది ఏప్రిల్ నెలలో విపరీతంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఇలా నమోదు కావడం ఇది రెండవ సారట. 1901 సంవత్సరం లో ఏప్రిల్ నెలలో తొలిసారిగా ఇదే స్థాయిలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయట. వాస్తవానికి ఏప్రిల్ నెలలో వడగాలులు వీచడం అనేది ఉండదు. మే ప్రథమార్థం లేదా ద్వితీయార్థంలో వడగాలులు వీచడం పరిపాటి. కానీ ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే వడగాలులు విపరీతంగా వీచాయి.. ఇక ప్రస్తుత మే నెలలో కూడా విపరీతంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయట. వడగాలులు వీస్తాయట.

# సంపాదకీయం

## యుద్ధాలు విధ్వంసానికి ప్రతిరూపాలు

మధ్యప్రాచ్యంలో జరుగుతున్న సంఘటనలు మారణహోమానికి దారితీస్తున్నాయి. ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య గాజా విషయంలో సాగుతున్న సుదీర్ఘ పోరాటం, సిరియా సంక్షోభం, అంతర్యుద్ధం, ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం శాంతి కాముకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, లెబనాన్, సైప్రస్ తదితర దేశాలున్నాయి గాజా స్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్‌లు ఇజ్రాయెల్ ఆక్రమిత పాలస్తీనా భూభాగాలు. వీటిపై యాసర్ అరాఫత్ వంటి యోధులు ఇజ్రాయెల్‌పై పోరాడి విఫలమైన సంగతి తెలిసిందే. అప్పట్లో భారత దేశం పాలస్తీనాకు వెన్నుదన్నుగా నిలిచింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో భారత్ ప్రస్తుతం ఇజ్రాయెల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నది. మధ్య ప్రాచ్యంలో సుమారు 371 మిలియన్ల జనాభా ఉంది. ఇందులో సుమారు 95% పైగా ముస్లిం జనాభా ఉంది. మధ్యప్రాచ్యంలో దాదాపు 90% ఇస్లాం మతాధిక్యత గల ప్రజలున్నారు. ఇన్ని దేశాల మధ్యలో గల ఇజ్రాయెల్ ఒక చిన్నదేశం. ఇది యూదుల దేశం. అయినా ఆయుధ సంపత్తిలోను, ఆర్థిక సంపత్తిలోను, సాంకేతికంగాను ఇజ్రాయెల్ అత్యంత శక్తివంతమైన దేశం. మధ్యప్రాచ్య దేశాలు చము రు సంపదలతో తులతూగుతున్నాయి. ముస్లిం దేశాలకు అమెరికాకు బద్ధవైరం కొనసాగుతున్న నేపథ్యంలో ముస్లిం వ్యతిరేక ఇజ్రాయెల్‌ను అడ్డం పెట్టుకుని లబ్ధి పొందాలనే అమెరికా ఆశ అక్కడ అప్పుడప్పుడూ ఉద్రిక్తతలకు దారితీస్తున్నది. అమెరికా అన్ని విషయాల్లోను ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తున్నది. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత జరిగిందిదే. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య ప్రస్తుతం తీవ్రమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పెద్దన్నలా వ్యవహరించవలసిన అమెరికా ఇరుదేశాల మధ్య రగులుతున్న సమస్యకు ఆజ్యం పోస్తున్నది. హమాస్ దాడికి ప్రతీకారంగా ఇప్పటికే గాజాలో జరిగిన మారణహోమంలో పలువురు పాలస్తీనీయులు మరణించిన విషయం విదితమే. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులకు తెగబడిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నది. ఇరాన్ ఇజ్రాయెల్‌పై డ్రోన్లతో దాడి చేసిందని, అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఇరాన్ పై క్షిపణి దాడులు జరిపిందని వార్తలు వెలువడుతున్నాయి. ఇప్పటికే రష్యా ఉక్రెయిన్‌ల మధ్య గత రెండు సంవత్సరాలకు పైగా కొనసాగుతున్న యుద్ధం అమెరికా దన్నుతో రావణకాష్ఠంలా కొనసాగుతూనే ఉంది. అయితే ఆ ఇరుదేశాలు అణ్వాయుధాలను ప్రయోగించకపోవడం ప్రపంచానికి కొంత ఉపశమనంగానే భావించాలి. అయితే రష్యాఉక్రెయిన్ల మధ్య యుద్ధం వలన ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి. పాక్ అన్నమో రామచంద్రా అని అలమటిస్తున్నది. టూరిజంపై ఆధారపడిన శ్రీలంక నాటి పాలకుల చర్యలతో అంతకు ముందే ఆర్థికంగా ఛిన్నాభిన్నమైపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌ఇరాన్‌ల మధ్య రగిలిన కార్చిచ్చు వల్ల ఎన్ని దేశాలు ఆర్థికంగా కుంగిపోతాయో ఇప్పుడే ఊహించలేము. అయితే ఈ దేశాల మధ్య సంధి కుదిరే మార్గాన్ని అన్వేషించడంలో ఐక్యరాజ్య సమితి విఫలం కావడం విడ్డూరం. భారత్ లాంటి విదేశాంగ విధానాన్ని అనుసరించడమే అన్ని దేశాలకు శరణ్యమని వర్తమాన ప్రపంచ చరిత్ర నిరూపిస్తున్నది. భారత్ కూడా ఇతర దేశాల వలన, పొరుగు దేశాల వలన సుదీర్ఘ కాలం నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. అయితే మన దేశం అనుసరిస్తున్న విదేశాంగ విధానం మన సార్వభౌమత్వాన్ని కాపాడుతున్నదనే చెప్పాలి. భారత దేశానికి, ఇతర దేశాలకు విదేశాంగ విధానాల్లో చాలా వ్యత్యాసముంది. అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడి ఉండడం కూడా భారత్‌కు ప్రపంచంలో విశ్వసనీయత సంపాదించి పెట్టింది. అదే సందర్భంలో భారత దేశ శాంతి వచనాలు పరాయి పాలకులు అసమర్థతగా భావించారు. అయితే క్రమేపీ భారత్ కూడా ఈ వాస్తవాన్ని గ్రహించి దూకుడుగా ముందుకు సాగతున్నది. చైనాపై దలైలామా పోరాటం చేయడం, విఫలం కావడం శరణార్థిగా దలైలామా భారత్‌కు రావడం చైనాకు నచ్చడం లేదు. టిబెట్‌తో పాటు అరుణాచల్‌ప్రదేశ్ కూడా తమదేనంటూ చైనా ఆరోపించడాన్ని భారత్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూనే ఉంది. ఒకప్పుడు టిబెట్ స్వతంత్ర రాజ్యం. తర్వాత చైనా ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తిగల ప్రాంతంగా మారింది. అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ల మాదిరిగా చైనా కూడా బౌద్ధరామాలను ధ్వంసం చేసింది. భారత దేశానికి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఇతర దేశాల వల్ల పీడించబడ్డ వారికి ఆశ్రయం కల్పించిన నేపథ్యం ఉంది. బంగ్లాదేశ్ విమోచనలో కీలక భూమిక పోషించడంలోను, టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు ఆశ్రయం కల్పించడంలోను, అప్పటి పాలస్తీనా నాయకుడు దివంగత యాసర్ అరాఫత్‌కు మద్దతు ఇవ్వడంలోను, ఎల్‌టిటిఇ దాడుల నుండి శ్రీలంకను కాపాడంలోను భారత దేశం పోషించిన పాత్ర శ్లాఘనీయం. మన దేశ ప్రయోజనాలను సైతం ప్రక్కనబెట్టి బలహీన దేశాల పట్ల భారత దేశం చూపించిన ఔదార్యం చరిత్రకు అందని త్యాగాల సమాహారం. భారత దేశం అణ్వస్త్ర దేశమైనప్పటికీ మొదటగా తాను ఏ దేశంపైనా అణ్వస్త్రాలను ప్రయోగించబోనని భారత్ స్వీయ నియంత్రణ విధించుకుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ అడుగడుగునా భారత్ భద్రత కు ముప్పుగా మారిన పాకిస్తాన్‌తో ఎన్నో శాంతి ఒప్పందాలు కుదుర్చుకుంది. పాక్ పాలకులు అన్ని ఒప్పందాలను కాలరాస్తూ భారత్‌ను ఇబ్బందులకు గురి చేశారు. పంజాబ్, కశ్మీర్‌లలో పాక్ దురాగతాలను చరిత్ర మరవదు. కశ్మీర్ యువతను రెచ్చగొట్టి భారత్‌పై విద్వేషాలను రగిలించడం, జిహాద్ పేరుతో ఉగ్రవాదులను తయారు చేసి ప్రజల ధన, మాన, ప్రాణాలతో చెలగాటమాడిన పాక్‌కు భారత ప్రభుత్వం సరైన గుణపాఠాలే నేర్పింది. ఉగ్రవాదుల కారణంగా జమ్మూకశ్మీర్ ఇప్పటికీ అభివృద్ధికి దూరంగా నెట్టబడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా క్లిష్టతరమైనా కశ్మీర్ ప్రజలను ఇతర భారత ప్రజలతో సమానంగా జనజీవన స్రవంతిలో కలపాలనే ఆకాంక్షతో, అభివృద్ధి పథంలోకి కశ్మీర్ యువతను మళ్ళించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నది. మన భూభాగాలను మనం కాపాడుకోవడానికి, ఉగ్రవాద పీడిత ప్రాంతాల ప్రజలకు శాంతి సుస్థిరతలతో కూడిన అభివృద్ధిని అందించడానికి జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం అనుసరించిన విధానం సరియైనదే. ఏదిఏమైనప్పటికీ భారత్‌తో పాక్ శత్రుత్వం కొనసాగించడం, చైనాతో దాయాది దేశం గాఢమైన స్నేహం పాము పడగ నీడలో సేదతీరడం లాంటిది. భారత్ తో శత్రుత్వం పెట్టుకుని దశాబ్దాల తరబడి భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తూ చైనాతో అంటకాగడం వలన పాక్‌కు ఒనగూడిన ప్రయోజనం శూన్యం. తన దేశ ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేని దుస్థితిలో పాకిస్తాన్ ఆర్థిక సాయం కోసం ప్రపంచం ముందు సాగిలపడింది. భారత్ కు సరిహద్దునున్న పాక్, చైనాలు అణ్వస్త్ర సామర్థ్యం కలిగి ఉన్నాయి. పాక్ తాను నాశనమైనప్పటికీ భారత్‌ను నాశనం చేయడానికి చైనాతో చేతులు కలిపింది. పాక్, చైనాకు ఒక సామంత రాజ్యంగా మారింది. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టుగా ఇండియా,- పాక్ విభేదాలతో పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చినట్టుగా చైనా ఉచ్చులో పాక్ చిక్కుకుపోయింది. భారత దేశానికి పొరుగునున్న శ్రీలంకలోకి అడుగుపెట్టాలని కూడా చైనా ప్రయత్నించిన మాట వాస్తవం. గతంలో ఎల్‌టిటిఇని అదుపు చేయాలనే నెపంతో శ్రీలంకలోకి అడుగుపెట్టడానికి ప్రయత్నించిన చైనాకు అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. చైనాను నిలువరించి భారత దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవాలనే లక్ష్యంతోనే అప్పటి రాజీవ్ ప్రభుత్వం తన శాంతి సైన్యాన్ని శ్రీలంకకు పంపడం జరిగింది. భారత దేశం ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలనే కోరుకుం టున్నది. అయినప్పటికీ పొరుగు దేశాలు ఈర్ష్యాద్వేషాలతో భారత్ సమగ్రతకు చేటుగా పరిణమించడం శోచనీయం. కొట్లాటల వలన, యుద్ధాల వలన ఎవరికీ ఒనగూడే ప్రయోజనం ఉండదు. ప్రజలే పరాజితులుగా మిగులుతారు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల పరిణామాలు ఈ విషయాన్నే నిరూపించాయి. ప్రాచీన కాలం లో యుద్ధాలన్నీ సంప్రదాయమైన ఆయుధాలతో జరిగేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులులేవు. మరో ప్రపంచ యుద్ధం కనుక సంభవిస్తే అది మహాప్రళయానికే దారితీస్తుంది. ఇప్పటికే ప్రపంచంలో అనేక యుద్ధాలు జరిగాయి. రెండు మహా ప్రపంచ సంగ్రామాల పరిణామాలను ప్రపంచం చవిచూసింది.

# ఎన్నికలకు ఇంత ఖర్చా!




'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించిన సమాచారం ప్రకారం 2019లో 32 జాతీయ, రాష్ట్ర పార్టీలు ఉమ్మడిగా ఖర్చు చేసిన రూ. 2,994 కోట్లలో, రూ. 529 కోట్లను నేరుగా తమ తమ అభ్యర్థులకు అందించాయి. 2009 ఎన్నికలలో ఆరు జాతీయ పార్టీలకు చెందిన 388 లోక్‌సభ సభ్యులు రూ.14.20 కోట్లు అందుకున్నట్లు, 2014 ఎన్నికలలో ఐదు జాతీయ పార్టీల నుండి గెలుపొందిన 342 అభ్యర్థులు ఉమ్మడిగా రూ.75.60 కోట్లు అందుకున్నట్లు తమ డిక్లరేషన్ పత్రాలలో వెల్లడించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫారమ్స్ తెలిపింది. లోక్‌సభకు ఏడు దశలలో జరుగుతున్న ఎన్నికలలో దాదాపు 49.70 కోట్ల మంది స్త్రీ, 47.10 కోట్ల మంది పురుషులతో కలిపి మొత్తం 96.80 (దాదాపు ప్రపంచ జనాభాలో పది శాతం, 27 ఐరోపా సభ్యదేశాల ఉమ్మడి జనాభా కన్నా అధికం)ఓటర్లు పాల్గొననుండడం ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల వేడుక అనవచ్చు. 140 కోట్ల దేశ జనాభాలో దాదాపు 69% ఓటర్లున్నారు. 44 రోజుల పాటు ఏడు దశలలో కొనసాగే ఈ ఎన్నికలలో మొదటి దశలో 102 నియోజకవర్గాలలో ఏప్రిల్ 19న ప్రారంభమై వరుసగా ఏప్రిల్ 26న 89 నియోజకవర్గాలలో, మే 7న 94 నియోజకవర్గాలలో, 13న 96 నియోజకవర్గాలలో, 20న 49 నియోజకవర్గాలలో, 25న 57, జూన్ 1న 57 నియోజకవర్గాలలో ఏడవ దశతో ముగుస్తాయి. భారీ స్థాయిలో ఎన్నికల నిర్వహణకు వ్యయప్రయాసలతో పాటు ఖచ్చితమైన ప్రణాళిక అవసరం. 2019లో రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా, స్వాతంత్ర్యానంతరం అక్టోబర్ 25, 1951 నుండి ఫిబ్రవరి 21, 1952 వరకు 68 దశల్లో దేశంలో జరిగిన మొట్టమొదటి ఎన్నికలకు రూ. 10.45 కోట్లు, 2014 ఎన్నికలకు రూ.3,870 కోట్లు ఖర్చయినట్లు ప్రభుత్వం తెలిపింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ప్రభుత్వం రూ. 50,000 కోట్లు వెచ్చించినట్లునట్లు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ నివేదించింది. ఈ లెక్కన 2024 ఎన్నికలకు దాదాపు ఒక లక్షా ఇరవై వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇందులో 20% ఎన్నికల నిర్వహణ కోసం భారత ఎన్నికల సంఘం, మిగతా 80 శాతం వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం కోసం ఖర్చు పెడతారని ఫస్ట్ పోస్ట్ సంస్థ తెలిపింది. 1951లో ఒక్కో ఓటర్ కోసం కేవలం 6 పైసలు వ్యయమవగా 2014లో అది రూ.46కి పెరగడం పెరుగుతున్న ఆర్థిక భారాన్ని సూచిస్తుంది. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ చైర్మన్ ఎన్ భాస్కరరావు బ్లూమ్‌బెర్గ్‌తో మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులో ఎక్కువ భాగం సామాజిక మాధ్యమాల ప్రచారానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. భాస్కరరావు అభిప్రాయంతో ఏకీభవిస్తూ కొలంబియా యూనివర్సిటీ లెక్చరర్ సైమన్ చౌచర్డ్ ఓటర్లను ఆకర్షించడానికి రాజకీయ నాయకులు ఖర్చులకు ఏమాత్రం వెరవక వినూత్న పోకడలను ఆశ్రయిస్తున్నారన్నారు. విజయమే లక్ష్యంగా అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఎరవేయడం, బహుమతులు ఇవ్వడంతో పాటు విభిన్న రకాల వస్తువులతో ప్రచారం చేస్తుండడంతో అవి విక్రయించే వ్యాపారులు కూడా లబ్ధి పొందుతున్నారు అని అన్నారు.

దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే 543 మంది లోక్‌సభ సభ్యుల కోసం ఎన్నికలు నిర్వహించడం అత్యధిక ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. 2019లో అర్హులైన ఓటర్లు 91.20 కోట్లు కాగా, 2024లో అది 96.80 కోట్లకు చేరింది. అర్హత కలిగిన ఓటర్ల సంఖ్య పెరుగుదల, కాలానుగుణంగా సాంప్రదాయ ప్రచార పద్ధతులతో పాటు సామాజిక మాధ్యమాలను ఆశ్రయించడం ఎన్నికల నిర్వహణ ఖర్చుల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. అధికారులు, సాయుధ సిబ్బందిని మోహరించడం నుండి పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం) కొనుగోలు చేయడం, ఇండెలిబుల్ ఇంక్ (ఓటరు చూపుడు వేలిపై ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నిర్ధారించేలా వేసే గుర్తు) వంటి ఇతర అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడం, ఓటు హక్కు గురించి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడంలాంటి వాటిపై భారత ఎన్నికల సంఘం భారీగా ఖర్చు పెడుతుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికలు పూర్తయినప్పటి నుండి ఇవిఎంల సేకరణ, నిర్వహణ వ్యయం గణనీయంగా పెరిగింది. ఎన్నికల తర్వాత తొలి బడ్జెట్‌లో కేంద్రం ఇందుకు గాను రూ. 25 కోట్లు కేటాయించగా ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్‌లో, ఇవిఎంల కోసం తొలుత రూ. 1,891.8 కోట్లు, తదుపరి శీతాకాల సమావేశాల్లో రూ. 611.27 కోట్ల గ్రాంట్‌ల కోసం అదనపు డిమాండ్‌ను ప్రవేశపెట్టింది. పాలనాపరంగా ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి వేతనాలతో పాటు వాలంటీర్లకు పారితోషికం, శిక్షణా తరగతులకు హాజరయ్యే వారికి కరువు భత్యం, ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు.

ఎన్నికల సంఘం ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయడం, అభ్యర్థుల ఎన్నికల ప్రచార పర్యవేక్షణ, సున్నితమైన పోలింగ్ బూత్‌ల వద్ద అవకతవకలు జరగకుండా సజావుగా పూర్తి పారదర్శకంగా జరిగేందుకు వీడియో రికార్డింగ్ చేయడం, ఎన్నికల అనంతరం ఇవిఎంలకు పకడ్బందీగా సీళు వేసి పూర్తి బందోబస్తుతో ఎన్నికల లెక్కింపు తేదీ వరకు భద్రతా కేంద్రాలకు తరలించి అక్కడ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం, చివరిగా లెక్కింపు కేంద్రాలకు తరలించి అక్కడ ఓట్ల లెక్కింపు తరువాత ఫలితాలను వెల్లడించి గెలుపొందిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను అందచేయడానికి భారీ మొత్తంలో ఖర్చవుతుంది. భారత ఎన్నికల సంఘం మార్చి 22, 2024 న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల అధికారికి రోజుకు రూ. 350, పోలింగ్ అధికారులకు రోజుకు రూ. 250, సహాయ సిబ్బందికి రోజుకు రూ. 200 చెల్లిస్తుంది.

# ఉదయభానుడి సెగలు

సమ్మర్ హీటెక్కిస్తున్నది. వేసవి ఉష్ణోగ్రతలు జనాలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. భూమి నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. ఉదయం 8 గంటలు దాటితే వేసవి తాపం, ఎండ, ఉక్కపోత వెంటాడుతున్నాయి. నేడు పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటి పాదరసం ఎగబాకుతోంది. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ హెచ్చరికలు సహితం జారీ చేసే అసాధారణ స్థాయి వరకు చేరింది. ఒక వైపు భానుడి భగభగలు, మరో వైపు ఉక్కపోతలతో జనం నీడలను వెతుక్కుంటూ పరుగిడుతు న్నారు. వేసవి తాపాన్ని తట్టుకుంటూనే జీవనోపాధి పోరాటాలు కొనసాగిస్తున్నారు. మారుతున్న వాతావరణ ప్రతికూలతల ఫలితంగా వడ గాలులు, సూర్య ప్రతాపాలు తీవ్ర ప్రజారోగ్య సమస్యలకు ఊతం ఇస్తున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకుంటూ మన మన పనులను చేసుకోవడానికి కొన్ని జాగ్రత్తలు, జీవనశైలి మార్పులు చేసుకోవడమే మన ముందున్న ఏకైక మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. మే మాసంలో ఎండల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉంది కాబట్టి పలు చిట్కాలు తెలుసుకొని తగు జాగ్రత్తలు పాటించాలి. శరీరంపై నేరుగా మధ్యాహ్న వేళ సూర్య కాంతి పడకుండా ఉండేలా గొడుగులు, చెట్టు నీడలు, కృత్రిమ పై కప్పులు, బైకులపై పయణించే వారు చర్మాన్ని బట్టలతో కప్పుకోవడం, ముఖాన్ని కాటన్ చేతిరుమాలు లేదా టవల్‌తో కప్పుకోవడం, తలపై టోపి పెట్టుకోవడం, చల్లని ప్రదేశాల్లో ఉండే ప్రయత్నాలు, గాలి ప్రవహించే గదుల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుందాం. శరీరంపై నేరుగా అతినీలలోహిత కిరణాలు కలిగిన సూర్యరశ్మి పడితే హీట్ స్ట్రోక్, చర్మం ముడతలు, పొడిబారి పగిలి పోవడం, వేడితో అలసట లాంటి అసౌకర్యాలు కలుగుతాయి. ఎండ నుంచి ఇండ్లలోకి రాగానే ముఖం, కాళ్ళు, చేతులు, శరీరాన్ని చల్లని నీటితో కడుక్కోవడం పాటిస్తే రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుందని తెలుసుకోవాలి. ఇంటికి రాగానే ఐస్ బ్యాగ్‌తో ముఖం, మెడ, చేతులను రుద్దు కోవాలి. ఎండ నేరుగా ముఖం, తలపై పడకుండా చూసుకోవాలి. మధ్యాహ్న వేళ వంట చేయడం మానేయాలి. వంటగదిలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఆన్‌లో ఉంచాలి. ఎండకు మంచి నీరే దివ్య ఔషధం అని మరువరాదు. ఎండ, వడగాలుల్లో పని చేసినపుడు చమట రూపంలో శరీరంలోని నీటి శాతం తగ్గిపోయి ప్రమాదకర డీహైడ్రేషన్ (నిర్జలీకరణం) సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఎండల్లో తిరుగుతూ కఫీన్ రసాయనం అధికంగా ఉన్న టీ తాగడం మంచిది కాదు. వడ దెబ్బకు ఉత్తమ ఔషధంగా మట్టి పాత్రల్లోని చల్లని నీరు, చిటికెడు చక్కర/ఉప్పు కలిపిన నీళ్లు, నిమ్మకాయ రసం, కొబ్బరి నీళ్లు, ఇంట్లో చేసిన షర్బత్ ద్రవాలు, మజ్జిగ, తాజా పండ్ల రసాలు తీసుకోవడం ఉత్తమం. ఆల్కహాల్ సేవనంతో డీహైడ్రేషన్ పెరుగుతుందని గమనించి పూర్తిగా తగ్గించాలి. నీటి శాతం అధికంగా ఉన్న మామిడి పండ్లు, పుచ్చకాయ, కీర దోసకాయ, పాలకూర, కర్బూజ, స్ట్రాబెర్రీ, ద్రాక్ష పండ్లు లాంటిని తీసుకోవడం మంచిది. వేసవిలో లభించే సీజనల్ ఫుడ్స్ తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పండ్ల రసాల కన్న పండ్లను పూర్తిగా తినడం మంచి అలవాటు. వేసవిలో గుల్కంద్?, కొద్ది ఘాటైన పెప్పర్/చిల్లీ ఫుడ్స్ వాడడం మంచిది. దోసకాయ, గుమ్మడి కాయ, పొట్లకాయ, చికెన్ గ్రేవీ, గుడ్లు లాంటి ఆహారం తీసుకోవడం ఉత్తమమని తెలుసుకోవాలి. వేసవిలో టీ, కాఫీ, ప్రోటీన్ ఫుడ్స్ వల్ల డీహైడ్రేషన్ పెరుగుతుందని గమనించి వాటి వాడకాన్ని తగించాలి. ఉదయం 7 గంటల లోపు సమీప గార్డెన్స్‌లో వాకింగ్, వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎండలో కాకుండా ఇండోర్స్‌లో శారీరక వ్యాయామం, వీలైతే స్విమ్మింగ్ చేయాలి. అతిగా వ్యాయామం చేసినపుడు డీహైడ్రేషన్ సమస్యలను కొని తెచ్చుకోరాదు. వ్యాయామం చేస్తున్నపుడు మధ్య మధ్య విశ్రాంతి లేదా బ్రేక్స్ తీసుకోవడం ఉత్తమం. వేసవిలో సరి కొత్త వ్యాయామాలు చేయడం సముచితం కాదు. తొలిసారి యోగా, జిమ్ లాంటి వ్యాయామాలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాళ్లకు బూట్లు, చెప్పులు లేకుండా వ్యాయామం చేయడం అలవర్చుకోవాలి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడి గదులు కూల్‌గా ఉండే విధంగా శ్రద్ధ తీసుకోవాలి. కిటికీలకు కర్టెన్స్ అమర్చుకోవడంతో ఎండ నేరుగా ఇంట్లోకి ప్రవేశించదని తెలుసుకోవాలి. మధ్యాహ్న వేళల్లో వడగాలులు ప్రవేశించకుండా కిటికీలు మూసి వేయడం, సాయంత్రం తిరిగి తెరవడం మంచిది. అతి వేడి, అతి చల్లదనం నిద్రను భంగపరుస్తుంది. నిద్రకు ముందు స్నానం చేయడంతో శరీర వేడి తగ్గి నిద్రకు ఉపకరిస్తుంది. ప్రతి రోజు 6 – 8 గంటలు నిద్ర పోవాలి. నిద్రకు 2 గంటల ముందు వ్యాయామం చేయడం మంచిది కాదు. సాయంత్రం అతిగా తినడం, ఆల్కహాల్ తాగడం, పొగ తాగడం మానేయాలి. పడక గదికి టీవీ, సెల్‌ఫోన్, ట్యాబ్స్, ట్యాబ్లెట్స్ తీసుకురావద్దు. వేసవి తాపానికి చర్మం, తల వెంట్రుకలకు హాని కలుగుతుంది. ఎండ వల్ల సన్‌బర్న్, హీట్ రాషెస్, వెంట్రుకలు రాలి పోవడం లాంటి అనారోగ్యాలు పెరుగుతాయి. ఎండలోకి వెళ్లే ముందు చర్మానికి/వెంట్రుకలకు మాశ్చరైజర్స్, లోషన్స్, జెల్స్ వాడడం మంచిది. మన చర్మ స్వభావాన్ని బట్టి ముఖం, మెడ, ఎండ పడే శరీర ప్రాంతాలకు తగిన సన్‌స్క్రీన్ లోషన్స్ 3 గంటలకు ఒకసారి వాడడం మరువరాదు. పెదవులు పగలకుండా తగిన లిప్ స్టిక్, ఫేసియల్ వైప్స్ వాడాలి. స్ప్రే బాటిల్‌తో ముఖంపై చల్లని నీరు చల్లుకోవాలి. శరీరాన్ని తుడుచుకోవడానికి తడి కాటన్ బట్టను వాడండి. వేసవి తాపాన్ని తట్టుకొనే తేలికైన, వదులు, పలుచని, తెల్లరంగు కాటన్ లేదా లైనెన్ వస్త్రాలు, లూజ్ పైజామా, ధరించాలి. లెదర్, అక్రైలిక్, మందపు సిల్క్ వస్త్రాలు, జీన్స్ వాడరాదు. మెడకు స్కార్ఫ్, చేతులకు గ్లౌజులు, టోపీలు, జాకెట్స్ వాడడం మంచి మార్గంగా గమనించాలి. ఉతికి ఆరేసిన బట్టలు పూర్తిగా ఎండే విధంగా చూసుకోవాలి. వేసవి తాపం, వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటూనే ఆహారం, అసురక్షిత నీటి నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వేసవి కాలంలో పిల్లలు, వృద్ధులపట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం అనిపిస్తే సాధారణ ప్రాతిపదికన డాక్టర్ చెకప్‌లు చేయించుకోవాలి. మధ్యాహ్న వేళ ఇంటిలో ఉండడం అన్నింటి కన్న ఉత్తమమైన మార్గం అని తెలుసుకొని మసలుకుందాం.

## ప్రపంచ మానవాళికి 'ఎల్‌నినో' ముప్పు

ప్రపంచ వాతావరణ సంస్థ (వరల్డ్ మెటీరొలాజికల్ ఆర్గనైజేషన్, డబ్ల్యూయంఓ) విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది చివరలో 'ఎల్ నినో' అనబడే వాతావరణ ప్రతికూల మార్పు రావచ్చుననే విషయం ప్రపంచ మానవాళిని భయపెడుతున్నది.'ఎల్ నినో' ఏర్పడితే నైరుతి రుతుపవనాలు బలహీనపడి, భారతదేశంలో తక్కువ వర్షపాతం నమోదై వ్యవసాయం దెబ్బతిని, కరువులు సంభవిస్తాయనే నిర్ధారణకు వచ్చారు సైంటిస్టులు. మార్చి మొదటి వారం నుంచి ఇండియాలోని 13 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అతిగా వేడెక్కడం గమనించారు. మూడేళ్ల తరువాత 2023 మార్చిలో 'లా నినా' ముగిసి రానున్న రోజుల్లో 'ఎల్ నినో' ప్రభావం ప్రారంభం అవుతుందని అంచనా వేస్తున్నారు. 'ఎల్ నినో, లా నినా సదరన్ ఆసిలేషన్ (ఈయన్‌యస్ఓ)' వలయాల ప్రభావంతో 2023 మే, జూన్‌లో తటస్థ స్థితి నుంచి 'ఎల్ నినో' బలపడుతూ సెప్టెంబర్ నాటికి 80 శాతం పెరిగే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. 'ఎల్ నినో, లా నినా సదరన్ ఆసిలేషన్ (ఈయన్‌యస్ఓ)' వలయాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలు వాతావరణ మార్పులకు లోనవుతాయని వర్ణించబడింది. గత మూడేళ్లుగా కొనసాగుతున్న 'లా నినా' ప్రభావం క్రమంగా తగ్గుతూ రానున్న రోజుల్లో 'ఎల్ నినో' చక్రం పునరావృతం కావచ్చని తెలుస్తున్నది. గత 8 ఏండ్లలో ప్రపంచం అధిక ఉష్ణోగ్రతలను నమోదు చేసిందని, 'లా నినా' ప్రభావంతో గత 3-ఏండ్లలో కొంత వరకు ఉష్ణోగ్రతలు తగ్గడం, అధిక వర్షపాతం నమోదు కావడం గమనించారు. 2016లో 'ఎల్ నినో' ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం చూశాం. రానున్న ఏండ్లలో 'ఎల్ నినో' ప్రభావం పెరుగుతూ ప్రపంచవ్యాప్తంగా వేడి గాలులు, ప్రతికూల వాతావరణ మార్పులు, కరువు కాటకాలు, కొన్ని ప్రాంతాల్లో అకాల వర్ష భీభత్సాలు ఎదురుకావచ్చని హెచ్చరిస్తున్నారు. 'ఎల్ నినో' అనబడే స్పానిష్ పదానికి 'లిటిల్ బాయ్' అని, 'లా నినా' పదానికి 'లిటిల్ గర్ల్' అని అర్థాలు ఉన్నాయి. సహజ సిద్ధంగా కేంద్ర తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహా సముద్ర ఉపరితలం అధిక తాపాన్ని లేదా వేడిని పొందడాన్ని 'ఎల్ నినో'గా అర్థం చేసుకోవాలి. సగటున ప్రతి 2 నుండి 7 ఏండ్లలో ఒకసారి ఏర్పడే 'ఎల్ నినో' ప్రభావంతో దక్షిణ ఆసియా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా ప్రాంతాలు తీవ్ర కరువును ఎదుర్కొంటాయి. దీని ప్రభావంతో సముద్ర ఉపరితల జలాలు వేడెక్కి పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో హరికేన్లు కూడా రావచ్చని తెలుస్తున్నది.

# స్థానిక వార్తలు

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ముస్లిం సంఘ సభ్యులు




**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండల కేంద్రానికి చెందిన ముస్లిం సంఘ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముత్యాల సునీల్ వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కొరకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నొళ్ళ శివకుమార్, బద్దం లింగారెడ్డి, మోహన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీలో చేరిక




**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ప్రభాకర్, జనార్దన్ బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగా ప్రసాద్, దిబ్బ శ్రీను, దేవన్న, సుదర్శన్, భాను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుడు గుంటి పిచ్చయ్యకు దాసరి నారాయణరావు పురస్కారం




**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణానికి చెందిన జాతీయస్థాయి రంగస్థల కళకారుడు గుంటి పిచ్చయ్యకు దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు పురస్కారం వరించింది. గీతాంజలి కళామండలి వారు తెనాలిలో నిర్వహించిన అవార్డులో ప్రధానోత్సవ కార్యక్రమంలో అతిధుల చేత వారు పురస్కారాన్ని అందుకున్నారు. కాగా వారికి పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ లఘు చిత్ర దర్శకుడు తిరుప్ ఎర్పుల ఆధ్వర్యంలో శనివారం వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కళా రంగంలో మరెన్నో ఉన్నతమైన అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంధం యాదగిరి, గుండె పంగు రమేష్, గుండెల సూర్యనారాయణ, చీమ శ్రీను, మచ్చ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు




**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని డొంగర్గావ్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మన గ్రామం అభివృద్ధిలో ముందుకు పోవాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని తెలుపుతూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్యాల కరుణాకర్, గ్రామ నాయకులు షైక్ షకీల్ సమక్షంలో గ్రామ యువకులు 30 మంది యువకులు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోవ దౌలత్ రావు మోకాశి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కరుణాకర్ మండల నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజిద్, ఆడే సునీల్ కుమార్, షకిల్, శేఖర్, ఆవుల రమేష్, శ్యామ్ రావు బీర్సావ్ కుంరా శత్రుఘున్ అర్జున్, ఏక్ నాథ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసమే మీముందుకు వచ్చా..
# ఓటుతో ఆశీర్వదించండి





**సిలిండర్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించండి**

**స్వతంత్ర ఎంపీ అభ్యర్థి రాథోడ్ సుభాష్**



**వాస్తవ నేస్తం,నిర్మల్ బ్యూరో:** పేద ప్రజల అభివృద్ధి కోసమే మీ ముందుకు వచ్చానని. సిలిండర్ గుర్తుకు సిలిండర్ గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని స్వతంత్ర ఎంపీ అభ్యర్థి రాథోడ్ సుభాష్ ఓటు అభ్యర్థించారు. శనివారం రోజు నిర్మల్ జిల్లాలో పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామ గ్రామానికి తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. ప్రస్తుతం పోటీలో ఉన్న పార్టీలకు, ఆ పార్టీల అభ్యర్థులకు గతంలో ఎన్నో అవకాశాలు ఇచ్చామని కానీ 20 ఏళ్ల పదవీ కాలంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పడానికి వారి దగ్గర జవాబు లేదని అన్నారు . వారి హయంలో మీ మనస్సాక్షిగా, మీ యొక్క, మా యొక్క, మన యొక్క దశాదిశా మారితే వారికే ఓటేయాలని అన్నారు. యువతతో పాటు వివిధ పార్టీల కార్యకర్తలు ఈసారి రాజకీయ నాయకుల వసూళ్లను దృష్టిలో పెట్టుకొని ఓటు ఓటు వేయాలని అన్నారు. రాజకీయ నాయకుల యొక్క ఒత్తిడిలో రాకుండా ఒక్కసారి ఆలోచించాలని ఆలోచించి ఓటేయాలని యువతను అభ్యర్థించారు. ఓట్ల సమయంలో వీరికి గుర్తుకొచ్చే ధర్మం గానీ యువత కానీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మాత్రం గుర్తుకురారు అని, పట్టించుకోరు అని చెప్పారు. అదే వేరే జిల్లాల్లో వెళ్తే అక్కడి నాయకుల పేర్లు ఇతర ఇతర రాష్ట్రాల్లో కూడా ఉంటాయని కానీ మన జిల్లా నాయకుల పేర్లు కనీసం జిల్లాలో ప్రజలకు తెలియదని అన్నారు. పార్లమెంటులో సరిగ్గా గళం విప్పే నాయకులు లేకపోవడంతో ఇప్పటికీ మన యొక్క ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు ఎలాంటి పెద్ద ప్రాజెక్టులు గానీ, అదే విధంగా పెద్ద ఫ్యాక్టరీలు గానీ, మరే ఇతర సౌకర్యాలు గాని మన జిల్లా ప్రజలకు రాలేదని అన్నారు. రాష్ట్ర రాజధాని కి కేవలం 250 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాం. వ్యాపారానికి , రవాణా సౌకర్యానికి అనువైన ప్రదేశం అయిన ఒక్క ఫ్యాక్టరీ మన జిల్లా కు రాలేదనీ అన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తా అన్న కాంగ్రెస్ నట్టేటముంచిందని దండిగా ఓట్లు రాబట్టుకొని, అధికారంలోకి వచ్చి ఇప్పుడేమో.... అప్పుడు చేస్తా ఇప్పుడు చేస్తా అనుకుంటా కాలం వెళ్లదిస్తూన్నారని అన్నారు. టిఆర్ఎస్ కాంగ్రెసొల్లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ కాలం వెలదీస్తున్నారు , అంతేతప్ప ఎక్కడ కూడా ప్రజలకు న్యాయం జరిగేలా కనిపిస్తలేదన్నారు. ఎన్నికల కంటే ముందు బిఆర్ఎస్ కాంగ్రెస్లో ఒకదానితో ఒకటి పోటీపడి తిట్టుకొని స్కాముల్లు లక్షల కోట్లు వేల కోట్లు ఉన్నాయని చెప్పేసి ఆ తర్వాత ఎందుకు సప్పుడు దాక ఉన్నారో చెప్పాలని అన్నారు. అదేవిధంగా బీజేపీ పార్టీ కూడా బీఆర్ఎస్ యొక్క అవినీతిపై మాట్లాడకపోవడం విడ్డురమనీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో జరిగిన అవినీతి అంతా బహిర్గతమైన కూడా ఎందుకు కేసీఆర్ పై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ఇప్పటివరకు దోచుకున్న నాయకులు సంపదలు కక్కిస్తానని, ప్రజల సొమ్మును దోచుకున్న వారిని విడిచి పెట్టేది లేదని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి చెందాలంటే మార్పు కచ్చితంగా అవసరమని, ఒక్క అవకాశం ఇచ్చి ఈ పార్టీలకు గట్టి బుద్ధి చెప్పాలని అన్నారు. ఆదివాసి గిరిజన తండాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలతో పాటు ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తానని అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద నిధులు తీసుకువచ్చి ఎవ్వరు చేయని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. సర్పంచ్'గా ఉన్నప్పుడే రైతుల కోసం వ్యవసాయ క్షేత్రాలకు రోడ్లు వేయడం జరిగిందని, ఎంపీగా గెలిస్తే మరింత పట్టుదలతో పని చేసి భవిష్యత్తులో ఓటు అడగకుండా ప్రజలే తన కోసం ప్రచారం చేసి గెలిపించేలా కృషి చేస్తానని అన్నారు. అభివృద్ధిని ఓ స్థాయిలో తీసుకెళ్తానని అన్నారు. కొంతమంది నాయకులు పార్టీ విరాళాల పేరిట ప్రచారాల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని కానీ నేను రైతు కుటుంబంలో పుట్టినాను కాబట్టి ఒక రైతు కుటుంబంలో పుట్టినటువంటి నాకు ఇప్పటివరకు ఎవరు సహాయం చేయకపోయినా ప్రజల కోసం పోరాడుతూ తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నానని అన్నారు. ఇప్పుడు గుంపుగా వచ్చే వారు తరువాత కనుమరుగు అయిపోతారని అన్నారు. అదే విధంగా పార్టీల దగ్గర వేల కోట్ల రూపాయలు ప్రచారం కోసం వాళ్లకు నిధులు వచ్చాయని అన్నారు. ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలు గమనించాలని అన్నారు. అవినీతిపరుల నుండి సొమ్మును విరాళంగా తీసుకొని పార్టీలు ప్రజలకు ఎం అభివృద్ధి చేస్తాయని అన్నారు. దయచేసి యువత ప్రతి ఒక్క గ్రామంలో ఓటు రాథోడ్ సుభాష్ కు ఎందుకు వేయాలో తమ తమ వారికి వివరించి చెప్పాలని విన్నవించారు. నిరుద్యోగ సమస్య పై ఒక్కరు కూడా మాట్లాడరని, కేవలం ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు బురద జల్లు కోవడం తప్ప ఆ తర్వాత ఈ పార్టీలకు నిరుద్యోగా సమస్యా గుర్తుకు రాదని అన్నారు. గ్యాస్ సిలిండర్ గుర్తుకు ఓటు వేసి స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ సుభాష్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ దత్తా, హరన్ శ్రీకాంత్, గోరఖ్ నాథ్ కుంబేవాడ్, బాలాజీ, సాయి కుమార్, తరుణ్, కిట్టు పస్పట్టే మరియు వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.

# కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచల భద్రత ఏర్పాటు





**గీతం యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రం ,స్ట్రాంగ్ రూమ్**

**మీడియా సెంటర్లను పరిశీలించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు**



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు, మీడియా సెంటర్ ఏర్పాటు పనులు వేగంగా పూర్తి చేయాలనీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శనివారం జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలోని సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. జిల్లా కేంద్రం సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను శనివారం పరిశీలించారు. పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎన్ని కల సామాగ్రి, సిబ్బంది కి సంబంధించిన సంబంధించిన రవాణా ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**మాక్ పోలింగ్ పరిశీలించిన కలెక్టర్..**


పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సెక్టర్ అధికారులు, సహాయక సెక్టర్ అధికారులకు అంబేద్కర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన మాక్ పోల్ కార్యక్రమాన్ని కలెక్టర్ క్రాంతి వల్లూరు శనివారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటింగ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాకు పోలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాక్ పోలింగ్ నిర్వహణ వల్ల ప్రజలకు ఈవీఎంల పని తీరుపై అవగాహన ఏర్పడుతుందన్నారు. ఓటింగ్ సమయంలో సులువుగా తాము ఎంచుకున్న అభ్యర్థికి ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు . శత శాతం పోలింగ్ లక్ష్యంగా చేపట్టిన అవకాహన కార్యక్రమాల్లో భాగంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు అంచెల భద్రతా ఏర్పాటు..**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జయ రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ కేంద్రాన్ని స్ట్రాంగ్ ఏర్పాటను రుద్రారం శివారులోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ , మీడియా సెంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్ , స్ట్రాంగ్ రూముల వద్ద మూడు అంచల భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూముల వద్ద కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేపట్టిన ప్రజలు కౌంటింగ్ ప్రక్రియ కో అవసరమైన సిబ్బంది నియామకం అవసరమైన సామాగ్రి ఏర్పాట్లు పనులు పూర్తయినట్లు తెలిపారు. మీడియా సెంటర్ ద్వారా కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు మీడియా సెంటర్లో ఏర్పాటు చేయాల్సినట్లు , మీడియా సెంటర్ వద్ద జర్నలిస్టుల కావలసిన అన్ని రకాల ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పూర్వీకులుగా మారుతున్న చైనీయులు

ప్రపంచంలో అనేక రకాల సంస్కృతులు ఉన్నాయి. వీటిని ప్రజలు ఆయా ప్రాంతాలకు చెందిన వారు అనుసరిస్తారు. అయితే కొన్ని సంస్కృతులు ప్రజలను ఆశ్చర్యపరుస్తూ ఉన్నాయి. ఈ మధ్యకాలంలో అలాంటి ఒక సంస్కృతి ఎంతో మంది ప్రజలను ఆశ్చర్యపరుస్తుంది. ప్రజలు తమ చెవులను దెయ్యం చెవులలాగా మార్చుకునేందుకు శస్త్రచికిత్స చేయించుకోవడంలో నిమగ్నమై ఉన్నారు. చైనీస్ ప్రజల పాటించే ఈ విధానానికి 'ఎల్ఫ్ ఇయర్స్' కాస్మెటిక్ క్రేజ్ అని పేరు పెట్టారు. నిజానికి, జర్మన్ జానపద కథలలో దయ్యాల ప్రస్తావన ఉంది. వారు మరుగుజ్జులు, పెద్ద చెవులతో ఉంటాయి. ఆడిటీ సెంట్రల్ అనే వెబ్‌సైట్ నివేదిక ప్రకారం మొదటిసారిగా 'ఎల్ఫ్ ఇయర్స్' కాస్మెటిక్ క్రేజ్ 2021 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ఇది చెన్ జియానన్ అనే మహిళ చేసిన పోస్ట్‌తో ప్రారంభమైంది. ఇటీవల వారి చెవులకు శస్త్రచికిత్స చేసి బయటకు తీశారు. ఈ స్వల్ప మార్పు ఆమె ముఖం సన్నగా, యవ్వనంగా కనిపించేలా చేసిందని చెన్ నమ్మారు. 'ఎల్ఫ్ ఇయర్స్' ప్రక్రియ చేయించుకున్న మహిళ చెన్ మాత్రమే కాదు. ఈ మధ్యకాలంలో చాలా మంది చైనీయులు చెవుల శస్త్రచికిత్స కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. కొన్ని నివేదికల ప్రకారం ఎల్ఫ్ లాంటి చెవులను పొందడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి చెవుల వెనుక హైలురోనిక్ యాసిడ్‌ను ఇంజెక్ట్ చేయడం. అయితే ఈ పద్ధతి శాశ్వతమైనది కాదు. ఎందుకంటే ఇంజెక్షన్ ప్రభావం కొన్ని రోజులకు తగ్గి చెవులు అసలు స్థానానికి తిరిగి వస్తాయి. చెవులు శాశ్వతంగా ఎల్ఫ్ లాగా ఉండాలంటే ప్లాస్టిక్ సర్జరీ చేయాల్సి ఉంటుంది.





# భూమి, చంద్రుడే కాదు.. నక్షత్రాలు కూడా సంచరిస్తుంటాయి

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ కూడా తిరుగుతుంది.. అలాగే చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతుంటాడు.. ఇలానే కదా మనం చిన్నప్పుడు చదువుకున్నాం..మొదట్లో ఇంత పరిజ్ఞానం లేని సమయంలో భూ కేంద్రక సిద్ధాంతం ప్రతిపాదించారు. ఆ తర్వాత ఇది తప్పని నికోలస్ కోపర్నికస్ సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అప్పట్లో దీనిని చాలామంది వ్యతిరేకించారు. కానీ, నికోలస్ కోపర్నికస్ సైద్ధాంతికంగా వివరించడంతో అప్పటినుంచి సూర్యకేంద్రక సిద్ధాంతం మనుగడలో ఉంది. అయితే ఇప్పటివరకు భూమి, చంద్రుడు మాత్రమే సంచరిస్తాయని తెలుసు. అయితే నక్షత్రాలు కూడా సంచరిస్తాయని, అవి గ్రహాల మధ్య తిరుగుతాయని మీకు తెలుసా.. ఖగోళ శాస్త్ర ప్రకారం నక్షత్రాలు నక్షత్ర మండలానికి పరిమితమైపోతాయి. కానీ కొన్ని నక్షత్రాలు మాత్రం ఆ మండలాల మధ్య సంచరిస్తుంటాయి. నక్షత్ర మండలంలో గురుత్వాకర్షణ ఉన్నప్పటికీ, నక్షత్రాలు దాని మీద ఆధారపడి ఉండవు. ఖగోళ శాస్త్ర పరిభాషలో ఇలాంటి నక్షత్రాలను సంచార నక్షత్రాలు అంటారు. వీటిని అంతర మండల నక్షత్రాలు, ధూర్త తారలు అని పిలుస్తుంటారు. ఇవి 1997లో వెలుగులోకి వచ్చాయి. నక్షత్ర మండలాలలో సుమారు 15 నుంచి 50% వరకు ఇలా సంచరించే నక్షత్రాలు ఉంటాయట. ఇక భూ గ్రహానికి సంబంధించి సమీప ప్రాంతాన్ని పరిశీలిస్తే పాలపుంత, ఆండ్రో మెడా నక్షత్ర మండలం మధ్య 675 సంచార నక్షత్రాలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఇవి ఎలా పుడతాయో ఇప్పటికీ శాస్త్రజ్ఞులు కనిపెట్టలేకపోయారు. వీటి పుట్టుక సంబంధించి కొన్ని ఊహాగాన ఆధారాలున్నాయి. అంతరిక్షంలో చోటు చేసుకునే మార్పుల వల్ల కొన్ని నక్షత్రాలు పరస్పరం ఢీ కొట్టుకుంటాయి. అందులో కొన్ని నక్షత్రాలు బయటపడతాయి. అలా బయటపడిన నక్షత్రాలు నక్షత్ర మండలాల ఖాళీ ప్రాంతాల్లోకి వచ్చి చేరి, ఇలా మారతాయట. అలా చిన్న నక్షత్ర మండలాలల్లో ఏర్పడి, వాటి గురుత్వాకర్షణ శక్తిని దాటి వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భారీ నక్షత్ర మండలాలు పరస్పరం ఢీకొట్టుకున్నప్పుడు గురుత్వాకర్షణ శక్తి అస్తవ్యస్తమవుతుందట. అలాంటి సమయంలో కొన్ని నక్షత్రాలు బయటికి వస్తాయట. ఒక్కోసారి బ్లాక్ హెూల్ లేదా కృష్ణబిలంతో ఢీ కొట్టినప్పుడు అవి నక్షత్రం మండలం అవతల వైపునకు వస్తాయని కొన్ని సిద్ధాంతాలు పేర్కొంటు న్నాయి. అయితే స్థిరంగా, స్థితప్రజ్ఞతకు పర్యాయపదం లాంటి నక్షత్రాలు, అటూ ఇటూ సంచరించడం, నక్షత్ర మండలాల మధ్య తిరగడం ఇప్పటికీ ఒకింత ఆశ్చర్యమే.

# మనిషిని బలహీన పరుస్తున్న టాక్సిక్ పాజిటివిటీ..

పాజిటివ్ థింకింగ్‌కు చాలా పవర్ ఉందనే విషయం అందరికీ తెలిసిందే. ఇది నిరూపించదగిన ఎవిడెన్స్ కూడా ఉంటాయి. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో పాజిటివిటీ అవసరమే. కానీ ప్రతీ సందర్భంలోనూ, ప్రతీ విషయంలోనూ దానిపైనే ఆధారపడటానికి ప్రయత్నిస్తేనే అది టాక్సిక్ పాజిటివిటీగా మారుతుందని నిపుణులు చెప్తున్నారు. వాస్తవానికి ఇది ప్రమాదకరం. దీనివల్ల వ్యక్తి ప్రతికూల పరిస్థితులను, భావోద్వేగాలను ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కోల్పోవచ్చు. పాజిటివ్ థింకింగ్ మంచిదే.. కానీ ఎక్కువైతేనే ప్రమాదం. పైగా అదేమీ శూన్యంలో నుంచి పుట్టుకొచ్చిందేమీ కాదు. అదొక్కటే ముఖ్యమని, అది మాత్రమే మేలు చేస్తుందని భావించాల్సిన అవసరం లేదు. దానికి సామాజిక మద్దతు, స్వీయ సమర్థత, తట్టుకునే సామర్థ్యం వంటి అంశాలు తోడైతేనే మానవ శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. కేవలం పాజిటివిటీని మాత్రమే స్వీకరిస్తే టాక్సిక్ పాజివిటీగా మారుతుంది. దీనిని అవైడ్ చేయడం వల్ల మనుషుల్లో మానసిక స్థిరత్వం, దృఢత్వం ఏర్పడతాయి. ఒక వ్యక్తి తను చేస్తున్న పనిలో రాణించకపోవడం వల్ల బాధపడుతున్నారనుకుందాం. అప్పుడు వాస్తవాలు వివరించాలి. ఎదిగే మార్గం చూపాలి. కొంగ్రొత్త ప్రయోగాలకు అవకాశం ఇవ్వాలి. స్వీయ అనుభవం ద్వారా నేర్చుకునేలా, వాస్తవాలు గుర్తించేలా ప్రోత్సహించాలి. కానీ ఇందుకు భిన్నంగా అతనికి రాదు కాబట్టి మనమే ఆ వ్యక్తి విషయంలో సర్వస్వం అనుకొని సహాయం చేయడం, అవసరం ఉన్నా లేకున్నా అడిగి మరీ హెల్ప్ చేయడం, ప్రతిదానికీ నీకు నేనున్నాను అని భరోసా ఇవ్వడం అవతలి వ్యక్తిని బలహీన పరుస్తుంది. ఒక వ్యక్తి టాక్సిక్ పాజిటివిటీ బిహేవియర్ వల్ల అవతలి వ్యక్తి నష్టపోతారు.



# బోట్ నుంచి అదిరిపోయే స్మార్ట్ వాచ్



వైర్లెస్ హెడ్ ఫోన్స్, బ్లూటూత్ నెక్ బ్యాండ్, ఇతర డిజిటల్ ఉపకరణాలకు పేరుపొందిన బోట్ కంపెనీ.. సరికొత్త స్మార్ట్ వాచ్ ను తెరపైకి తీసుకువచ్చింది. ప్రస్తుతం యువత స్మార్ట్ వాచ్ ల వాడకం పట్ల విపరీతమైన ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కేవలం సమయం కోసం మాత్రమే కాకుండా ఫోన్ కాలింగ్, హెల్త్ ట్రాక్, ఇతర ఫీచర్లను ఇష్టపడుతున్నారు. యువత ఇష్టానికి అనుగుణంగా చాలా కంపెనీలు రోజుకో తీరుగా ఫీచర్లు యాడ్ చేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో పెద్ద పెద్ద కంపెనీల నుంచి మీడియం రేంజ్ కంపెనీల వరకు స్మార్ట్ వాచ్ లు సందడి చేస్తున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ వాచ్ లను రూపొందిస్తుండడంతో యువత అత్యంత ఇష్టంగా కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో బోట్ కంపెనీ తీసుకొచ్చిన స్మార్ట్ వాచ్ గేమ్ చేంజర్ లాగా ఉందని చెబుతున్నారు టెక్ నిపుణులు. స్ట్రోమ్ కాల్ 3 పేరుతో ఈ వాచ్ ను బోట్ కంపెనీ మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇంతకీ దీని విశేషాలేంటంటే..ఈ వాచ్ గుండ్రని, దీర్ఘ చతురస్రాకార మోడల్స్ లో ఈ వాచ్ లభిస్తోంది. ఇందులో బ్లూటూత్ కాలింగ్, నావిగేషన్ సపోర్ట్ ఉంది. పిక్సెల్ రిజల్యూషన్ 240ి296 గా ఉంది. నిట్స్ బ్రైట్ నెస్ 550 గా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేందుకు ఇందులో ఎస్ ఓ ఎస్ మోడ్ యాడ్ చేశారు. విపత్కర పరిస్థితుల్లో ముందస్తుగా ఎంట్రీ చేసిన కాంటాక్ట్ లకు సమాచారం అందించడం ఈ వాచ్ ప్రత్యేకత. దీని బ్యాటరీ సామర్థ్యం 230 ఎం ఏ హెచ్. సింగిల్ చార్జింగ్ తో ఏడు రోజుల వరకు బ్యాటరీ బ్యాకప్ ఉంటుందని బోట్ కంపెనీ చెబుతోంది. ఈ వాచ్ లో హెల్త్ ట్రాకర్ ఉంది. గుండె కొట్టుకునే వేగం, బ్లడ్ ఆక్సిజన్ మానిటర్, స్లిప్ సైకిల్ ట్రాకర్ వంటివి ఇందులో ఉన్నాయి. 700 ప్లస్ ఫ్రీ ఇన్ స్టార్ట్ యాక్టివిటీ మోడ్స్ ఇందులో ఉన్నాయి. ఇది సిల్వర్ మెటల్, ఓలీవ్ గ్రీన్, డార్క్ బ్లూ, యాక్టివ్ బ్లాక్, చెర్రీ బ్లోసం వంటి వేరియెంట్స్ లో లభిస్తోంది.

# జుట్టుకు రంగేసుకున్నందుకు జరిమానా



ఈ ఫ్యాషన్ యుగంలో మీ జుట్టుకు రంగు వేయడం సాధారణ విషయంగా మారింది. అమ్మాయిలే కాదు అబ్బాయిలు కూడా ఇలా చేస్తున్నారు. సాధారణంగా జుట్టు తెల్లగా మారినప్పుడు, వారు రంగులు వేసుకుని నల్లగా చేసుకుంటారు.కానీ ఈ రోజుల్లో జుట్టుకు ఎరుపు, పసుపు, నీలం రంగులు వచ్చే ట్రెండ్ ఉంది. జుట్టుకు రకరకాల రంగులు వేసుకునే ఇలాంటి వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తారు. కానీ దీని వల్ల ఎవరైనా జైలుకు వెళ్లారు అనే సందర్భాలు చాలా అరుదుగా వింటారు. అవును.. రష్యాలోని మాస్కోలో కూడా ఇలాంటి ఉదంతమే కనిపించడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఇటీవల మాస్కోలో తన జుట్టుకు పసుపు, నీలం రంగు వేసుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అతడికి జరిమానా విధించడమే కాకుండా కేసు కూడా పెట్టారు. ఆడిటీ సెంట్రల్ వెబ్‌సైట్ నివేదిక ప్రకారం ఏప్రిల్ 27 రాత్రి, మాస్కోలోని బస్టాప్‌లో స్టానిస్లావ్ నెటెసోవ్ అనే వ్యక్తి పని నుండి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. దాడి చేసిన వ్యక్తులు అతని ఫోన్‌ను దొంగిలించారు. అతని దంతాలలో ఒకటి విరిగిపోయేలా కొట్టారు. సంఘటన జరిగిన మరుసటి రోజు, స్టానిస్లావ్ తన పై జరిగిన దాడి గురించి చెప్పేందుకు పోలీసుల వద్దకు వెళ్ళాడు. అధికారులు అతనికి సహాయం చేయడం కంటే అతని జుట్టు పై ఎక్కువ ఆసక్తి చూపడం చూసి అతను ఆశ్చర్యపోయాడు. స్టానిస్లావ్ జుట్టుకు పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులు వేసుకున్నందుకు పోలీసులు దానిని ఉక్రెయిన్ చిహ్నంగా, రష్యన్ సైన్యానికి నేరంగా భావించారు. ఇది చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం. పోలీసులు అతని 'నేరం' కోసం ఒక నివేదికను సిద్ధం చేసి, అతని వేలిముద్రలను తీసుకొని ఆ నివేదికను సైన్యానికి పంపారని స్టానిస్లావ్ చెప్పారు. నివేదికల ప్రకారం రష్యా న్యాయస్థానాలు యుద్ధ వ్యతిరేకతను పరువు నష్టం కలిగించే నేరంగా పరిగణిస్తాయి. పునరావృతమయ్యే ఇలాంటి నేరాలకు దాదాపు రూ. 45 వేల వరకు జరిమానా విధించబడుతుంది శిక్షగా ఉంటుంది.

## పిల్లలను పరీక్షలకు సంసిద్ధం చేయండిలా

పరీక్షల సీజన్ వచ్చేసింది. అయితే పిల్లల చదువుల కంటే తల్లిదండ్రుల ఆందోళన ఎక్కువగా ఉంటుంది. అయితే పరీక్షా రోజుల్లో పిల్లలు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.అటువంటి పరిస్థితిలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఒత్తిడి నుండి రక్షించగల సులభమైన మార్గాలను పాటించాలి. ఏ బిడ్డకైనా దాని తల్లిదండ్రుల భావోద్వేగ మద్దతు చాలా ముఖ్యం. ప్రత్యేకించి పరీక్షల సమయంలో తల్లిదండ్రుల మద్దతు అవసరం. పిల్లలను మానసికంగా బలోపేతం చేస్తే, ఎలాంటి ఇబ్బందులకు భయపడడు. అతని ఆందోళనలను, భయాలను అంచనా వేయకుండా అర్థం చేసుకోవాలి. ఏదైనా సవాలుతో వచ్చే ఒత్తిడిని ఫేస్ చేయడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను సిద్ధం చేయవచ్చు. మైండ్‌ఫుల్‌నెస్ ప్రాక్టీస్, రిలాక్సేషన్ టెక్నిక్స్ మరియు టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను కూడా ప్రోత్సహించడం ద్వారా పిల్లల్లో ఒత్తిడి దూరమవుతుంది. చాలా మంది పిల్లలు తమ కోసం సరైన సమయ నిర్వహణ, స్టడీ మెటీరియల్ రివిజన్ స్ట్రాటజీని అంశాల్లో ఒత్తిడికి లోనవుతున్నారు. అటువంటి పరిస్థితిలో వారికి ఆచరణాత్మక సహాయం అవసరం.

# మోడీ ఉంటేనే దేశ అభివృద్ధి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండలంలోని చిన్న మన్నూర్, శంభు గూడ, మామిడి గూడ, భీంపూర్ గ్రామాలలో బీజేపీ మండల నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న అదిలాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ పల్లెలలో గడపగడపకు తిరుగుతూ మోడీ సంక్షేమ పథకాలను వివరిస్తూ, మోడీ పాలనలో ప్రతి ఒక్క వర్గానికి మేలు జరిగిందని. మోదీ ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇతర పార్టీల మాటలను నమ్మవద్దని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివాజీ, జిల్లా అధికార ప్రతినిధి, డాక్టర్ కేంద్ర లక్ష్మణ్, వైస్ ఎంపీపీ భరత్, మోజే అధ్యక్షులు సుభాష్, మోజే జెడ్పిటిసి కేశవరావు, నాయకులు వామన్ పటేల్ సుధాకర్ రెడ్డి, పరమేశ్వర సిందే, శైలేందర్ మండల ముఖ్య నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మరింత తగ్గనున్న రిజర్వేషన్ చార్జీలు




**హైదరాబాద్ :** వేసవి వేళ దూర ప్రయాణం చేసే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం రిజర్వేషన్ చార్జీలకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఎనిమిది రోజుల ముందు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే వారికి మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని ఎండీ సజ్జనార్ స్పష్టం చేశారు. టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్ ని సంప్రదించాలని సూచించారు. ఈ రాయితీని వినియోగించుకోవాలని ప్రయాణికులకు కోరారు.ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-విజయవాడ రూట్ లో వెళ్లే ప్రయాణికుల కోసం ప్రతి 10 నిమిషాలకో బస్సును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మార్గంలో ప్రతిరోజు 120కి పైగా బస్సులను సంస్థ నడుపుతున్నట్లు తెలిపింది.ఇందులో లహరి ఏసీ స్లీపర్ 2, నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ 2, ఈ-గరుడ 10, గరుడ ప్లస్ 9, రాజధాని 41, సూపర్ లగ్జరీ 62 బస్సులున్నాయని సంస్థ ఎండీ సజ్జనార్ వివరించారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే వారికి 10 శాతం రాయితీని సంస్థ కల్పిస్తోందని సజ్జనార్ వెల్లడించారు. తిరుగుప్రయాణ టికెట్ పై ఈ డిస్కౌంట్ వర్తిస్తుందన్నారు.బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే తిరుగు ప్రయణంపై 10 శాతం రాయితీని టీఎస్ఆర్టీసీ కల్పిస్తోంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే అన్ని హైఎండ్ సర్వీసుల్లోనూ ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ రూట్లలో వెళ్లే ప్రయాణికులు ఈ 10 శాతం రాయితీని వినియోగించుకోవచ్చు.శ్రీశైలానికి ప్రత్యేక బస్సులను ప్రకటించింది తెలంగాణ ఆర్టీసీ. భక్తుల సౌకర్యార్థం శ్రీశైల పుణ్యక్షేత్రానికి సరికొత్త రాజధాని ఏసీ బస్సులను నడుపుతోందని తెలిపింది. హైదరాబాద్ నుంచి ప్రతి గంటకో బస్సును భక్తులకు అందుబాటులో ఉంచినట్లు ఎండీ సజ్జనార్ తెలిపారు.ఈ బస్సుల్లో జేబీఎస్ నుంచి రూ.524, నుంచి రూ.564 టికెట్ ధర ఉందని తెలిపారు. అత్యాధునిక హంగులతో ఘాట్ రోడ్డుకు తగ్గట్టుగా ఈ రాజధాని ఏసీ బస్సులను ప్రత్యేకంగా సంస్థ తయారు చేయించామని తెలిపారు. వేసవిలో చల్లదనం అందించే ఈ బస్సులను వినియోగించుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకోవాలని సంస్థ కోరుతుందని పేర్కొన్నారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్ ని సంప్రదించవచ్చని సూచించారు.ఆవకాయ పచ్చడి ప్రియులకు తెలంగాణ ఆర్టీసీ గుడ్ న్యూస్ చెప్పింది. రుచికరమైన అమ్మమ్మ చేతి ఆవకాయ పచ్చడిని మీ బంధువులు, స్నేహితులకు ద్వారా సులువుగా పంపించుకోవచ్చని తెలిపింది. మీ సమీపంలోని టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్ల ద్వారా ఆవకాయ పచ్చడిని బంధుమిత్రులకు చేరవేసే సదుపాయాన్ని సంస్థ కల్పిస్తోందని ఎండీ సజ్జనార్ ఇటీవలే తెలిపారు. తెలంగాణతో పాటు టీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు తిరిగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర లకు ఆవకాయ పచ్చడిని సంస్థ డెలివరీ చేస్తోంది. పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లైన 040-23450033, 040-69440000, 040-69440069 ను సంప్రదించాలని సూచించారు.

# ఈనెల 7న ఎన్నికల ప్రచారానికి రానున్న హీరో వెంకటేష్

**ఖమ్మం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం**

**రఘురామిరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం..**

**ఖమ్మం :** ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ హీరో వెంకటేష్ కూతురు ఆశ్రిత,కొడుకు అర్జున్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనయ స్వప్ని రెడ్డి ప్రచారాన్ని నిర్వహించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం, కమలాపురం గ్రామాల్లో రోడ్ షో నిర్వహించి రామ సహాయం రఘురాం రెడ్డినీ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా హీరో వెంకటేష్ కూతురు ఆశ్రిత మాట్లాడుతూ ఈనెల 7న తన మామయ్య రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ తన తండ్రి వెంకటేష్ ప్రచారానికి రానున్నట్లు ఆమె తెలిపారు.

# బీజేపీకి ఓటేస్తే.. బానిస బతుకులే

## మంత్రి కొండా సురేఖ





**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ కి ఓటేస్తే అందరివి బానిస బతుకులు అవుతాయని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఒక్కసారి ఆలోచన చేసి ఓటు వేయాలని ఆమె సూచించారు. సిపిఎం బలపరిచిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం సిపిఎం విస్తృత స్థాయి సమావేశం సంగారెడ్డి లోని పిఎస్ఆర్ గార్డెన్'లో జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రివర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ ను పెంచి పోషిస్తున్న ప్రధాని మోదీకి పేదల కష్టాలు, సంక్షేమం, చదువులు, వైద్యం కనిపించవని దుయ్యబట్టారు. కేవలం ఆదాని, అంబానీలకు ఏం కావాలో? చూస్తారని విమర్శించారు. స్వర్గీయ ఇందిరాగాంధీ ప్రధాని ఉన్న సమయంలోనే అనేక పరిశ్రమలను నెలకొల్పడం జరిగిందని, వేలాదిమందికి ఉపాధి దక్కిందని గుర్తు చేశారు. స్వర్గీయ ప్రధాని రాజీవ్ గాంధీ హాయంలోనే ఐటి రంగానికి బీజం పడిందని, మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకురావడం జరిగింది అని పేర్కొన్నారు. 25 ఏళ్లు వెనుకబాటుకు గురైన మెదక్ ప్రాంతం అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమవుతుం దన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బిసి యువనేత నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**మతోన్మాద శక్తులను ఎదిరించాలి: సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు**

దేశంలో మతోన్మాద రాజకీయ శక్తులను ఎదిరించాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆ దిశగా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఈ పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికే దేశంలోని పలు సంస్థలను ప్రైవేటీకరణకు ప్రోత్సహించిన మోది రైతాంగం పై కూడా కన్నేసారని విమర్శించారు. రైతుల పంటలకు మద్దతు ధర, రైతన్న చట్టాలను అమలు చేయకుండా నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ దేశంలో బీజేపీ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే కార్మిక చట్టాలు ఖతమవుతాయన్నారు. ఈ దేశంలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ బీసీల కుల గణనకు ముందుకు రావడానికి సిపిఎం స్వాగతిస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రధాని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, ఎలక్షన్ కమిషన్ కూడా మౌన పాత్ర వహిస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక అవినీతి పరిపాలన బీఆర్ఎస్ కొనసాగిందని చెప్పారు. అందుకే టిఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం ప డారని స్పష్టం చేశారు. మెదక్ పార్లమెంట్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రజా సంఘాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

**టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తా: ఎంపీ అభ్యర్థి నీలం మధు**

తనను ఎంపీగా గెలిపిస్తే, ఎల్లవేళలా నియోజకవర్గానికి అందుబాటులో ఉంటానని ఎంపీ అభ్యర్థి నీలం మధు తెలిపారు. అలాగే టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిర ప్రాతినిధ్యం వహించినటువంటి మెదక్ పార్లమెంట్ నుండి పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పులి మామిడి రాజు, సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం, సిఐటియు రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, సిపిఎం జిల్లా నాయకులు మల్లేశం, రాజయ్య, వాజిద్ అలీ, మాణిక్యం, మూడు జిల్లాల సిపిఎం నాయకులు, సిఐటి నాయకులు పాల్గొన్నారు. అనంతరం సిపిఎం నేతలు మంత్రివర్యులు కొండా సురేఖ, ఎంపీ అభ్యర్థి నీలంమధునుశాలువాలతో ఘనంగా సన్మానించారు.

# యువత ఎటు వైపు



**వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారం హోరెత్తుతోంది. మరో వారం రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. గెలుపు ధీమాతో ఉన్న పార్టీలు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నా లు ముమ్మరం చేస్తున్నారు. అయితే తెలంగాణ ఎన్నికలలో ప్రధానంగా యువకులు నిర్ణయాత్మక శక్తిగా ఎదగడం విశేసం. ఈ యువ ఓటర్ల చేతిలో కీలక నేతల భవిష్యత్ తేలనుంది. రాష్ట్రంలో మొత్తం 3 కోట్ల 30 లక్షల ఓటర్లు ఉంటే.. వారిలో 8 లక్షల కొత్తగా నమోదయిన యువ ఓటర్లు ఉన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 19.74 కోట్ల మంది యువ ఓటర్లు ఉన్నారు. ఇక తెలంగాణలో చూస్తే యువ (పురుష) ఓటర్లు 64 లక్షల 89 వేల 502 కాగా.. యువ (మహిళ) ఓటర్లు 63 లక్షల 93 వేల 703గా ఉన్నాయి. 18 నుంచి 39 ఏళ్ల వయసున్న వారు కోటి 28 లక్షల 83 వేల 205 మంది ఉన్నారు. ఇలా యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నందున చాలా సెగ్మెంట్లలో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు యువమంత్రాన్ని జపిస్తున్నారు. రాష్ట్రంలో యువ ఓటర్లను ఆకర్షించడానికి వివిధ పార్టీల నేతలంతా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. యువ ఓటర్లతో మాట్లాడేందుకు యువ నాయకులను రంగంలోకి దించారు. ఇలా అన్ని పార్టీలు యువతను టార్గెట్ చేయగా.. వారు ఎటువైపు మొగ్గ చూపుతారో అని ఆసక్తిదాయకంగా మారింది.

ప్రధానంగా యువ ఓటర్లు తమకు ఉన్న సమస్య నిరుద్యోగం. నిరుద్యోగులను ఆదుకుంటాం, వాళ్లకి అవి చేస్తాం..ఇవి చేస్తాం అంటూ పనికిరాని హామీలనిస్తూ వాళ్లను ఇన్నళ్లూ వాడుకున్నారు రాజకీయ నేతలు. నిరుద్యోగ సమస్యపై చిత్తశుద్ధితో పనిచేసే లీడర్ కోసం యువ ఓటర్లు ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో నిరుద్యోగుల సంఖ్య ఏటికేడూ పెరుగుతూనే ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 37 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ అప్పటి బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను నిలువునా మోసం చేసింది. కేవలం ప్రకటనలకే పరిమితం అయిన ఉద్యోగాలను నమ్ముకుని నిరుద్యోగ యువత ఆగం అయిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో 10 ఏళ్లలో లక్షకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని చెబుతున్న నాటి కేసీఆర్ ప్రభుత్వం చేసింది మాత్రం 46 వేలు మాత్రమే అని గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి ఏటా లక్షల మంది డిగ్రీలు పూర్తి చేసినప్పటికీ ఆ స్థాయిలో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పించలేకపోయిందనే విమర్శలొచ్చాయి అప్పట్లో. డిగ్రీలు పూర్తి చేసిన 33.90 లక్షలమంది వన్ టైం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ప్రభుత్వ వెబ్ సైట్ లోనే స్పష్టం చేసింది అప్పట్లో. ఓకేషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు సుమారు 3 లక్షలకు పైగా ఉన్నారని సమాచారం. ఒక్క ఏడాది కాలంలోనే రాష్ట్రంలో నిరుద్యోగ సగటు 2.2 శాతం పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలలోనే కాంగ్రెస్ యువ ఓటర్ల మద్దతును పొందింది. వేలాది ఖాళీల భర్తీకి గ్రూప్ -1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేశామని, జూన్ లో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మరో 50 వేల ఖాళీలకు నోటిఫికేషన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చింది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రిక్రూట్ మెంట్ డ్రైవ్ లు చేపట్టడంలో విఫలమైన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీనికి తోడు 2022లో టీఎస్పీఎస్సీ గ్రూప్-1, ఇతర నియామక పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ కావడం, పరీక్షల రద్దు బీఆర్ఎస్ పై ఆగ్రహానికి మరింత ఆజ్యం పోశాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి తెలంగాణలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించారు.అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని, యూపీఎస్సీ తరహాలో 2025 నుంచి వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన లాంటి హామీలతో కాంగ్రెస్ యువ ఓటర్ల మద్దతును పొందింది. ఇక కాంగ్రెస్ 'యువరోషిణి' కార్యక్రమం కింద స్టార్టప్ లకు రూ.5,000 కోట్ల కార్పస్ ను కేటాయించాలని ప్రతిపాదించింది. తెలం గాణలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా యువ ఓటర్లను ఆకట్టుకోవడానికి కసరత్తులు చేస్తున్నాయి. . జాబ్ క్యాలెండర్, ఇతర నిరుద్యోగ సమస్యలపై ఫోకస్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. కానీ బీఆర్ఎస్, బీజేపీలు పదేళ్ల కాలంలో నిరుద్యోగులను మోసం చేశాయనే భావనలో ఉన్నారు యువ ఓటర్లు. అధిక శాతం యువ ఓటర్లు కాంగ్రెస్ విధానాల పట్ల సంతృప్తిగా ఉన్నారని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

# దోస్త్... అడ్మిషన్లు షురూ...

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి ఈ నోటిఫికేషన్ ను విడుదల చేశారు. మే 6వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. మూడు విడతలలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.ఇంటర్ లో పాసైన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు దోస్త్ అధికారిక వెబ్ సైట్ ఫ్టబిబిజూబ://టనీబబి.ఇ-ణణ.ణనీల.తిని/ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 1000కి పైగా కాలేజీల్లో ఈ ఏడాది నాలుగున్నర లక్షల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.ఫస్ట్ ఫేజ్ రిజిస్ట్రేషన్ మే 6వ తేదీ నుంచి 25 వరకూ నిర్వహించనున్నారు. విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మే 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు, జూన్ 3న తొలిదశ సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 4 నుంచి 10లోగా విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టు చేసేందుకు అవకాశం కల్పించారు. సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ జూన్ 4 నుంచి 13 వరకు నిర్వహిస్తారు. రెండోదశలో అప్లై చేసుకునే విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 4 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్లు, 18న సీట్ల కేటాయింపులు చేపడుతారు. జూన్ 19 నుంచి 24 వరకు స్టూడెంట్స్ సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.థర్డ్ ఫేజ్ రిజిస్ట్రేషన్లు జూన్ 19 నుంచి 25 వరకూ జరుగుతాయి. రూ.400 ఫీజుతో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూన్ 29న సీట్ల కేటాయింపు ఉంటుంది. జులై 8 నుంచి విద్యార్థులకు డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయి.

# అందమే అసూయ పడేలా!



మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ వెరీ హాటెస్ట్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 12 జనవరి 1988న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ లో జన్మించింది ప్రగ్య జైస్వాల్.ప్రంజూల్ జైస్వాల్ అనే సోదరి కూడా ఈమెకు ఉంది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్లో విద్యాభ్యాసం పూర్తి చేసింది.సింబయాసిస్ యూనివర్శిటీలో చదువుతున్న సమయంలో ఆమె వివిధ అందాల పోటీల్లో పాల్గొని విజయవంతమైన మోడల్గా మారింది. 2014లో కళ మరియు సాంస్కృతిక రంగంలో ఆమె సాధించిన విజయానికి సహజీవన సాంస్కృతిక పురస్కారాన్ని అందుకుంది. 2008లో ఆమె ఫెమినా మిస్ ఇండియా అందాల పోటీలో పాల్గొంది. అందాల పోటీ ఫెమినా మిస్ ఇండియా 2008 ద్వారా మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ డ్యాన్సింగ్ క్వీన్ మరియు మిస్ ఫ్రెండ్ ఎర్త్ టైటిల్లను గెలుచుకుంది. 2015లో మిర్చి లాంటి కుర్రాడు చిత్రంతో తెలుగు డెబ్యూ ఇచ్చిన ఈ బ్యూటీ... అదే ఏడాది వచ్చిన కంచె తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత తెలుగు ఓం నమో వెంకటేశాయ, గుంటూరోడు, నక్షత్రం, జయ జానకి నాయక, ఆచారి అమెరికా, అఖండ, సన్ అఫ్ ఇండియా చిత్రాల్లో నటించింది.ఈ ముద్దుగుమ్మ కెరియర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ మంచి గుర్తింపు మాత్రం వరుణ్ తేజ్ హీరోగా క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందిన కంచే సినిమాతో దక్కించుకుంది.ఈ మూవీ తర్వాత ఈమెకు తెలుగు లో అవకాశాలు వరుసగా దక్కాయి.

# సుప్రీత క్రష్ ఎవరో తెలుసా?



ఒక్క సినిమా కూడా చేయకుండానే సోషల్ మీడియా సెన్సేషన్ గా అవతరించింది సుప్రీత. తాజాగా ఓ స్టార్ హీరో భర్తగా కావాలని మనసులో కోరిక బయటపెట్టింది. సుప్రీత పోస్ట్ వైరల్ అవుతుంది.నటి సురేఖావాణి రెండు దశాబ్దాలుగా చిత్ర పరిశ్రమలో ఉంది. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, లేడీ కమెడియన్ గా ఆమె పాప్యులర్ అయ్యారు. రెడీ, దుబాయ్ శ్రీను, బాద్ షా, నమో వెంకటేశా చిత్రాల్లో సురేఖావాణి కామెడీ నవ్వులు పూయిస్తుంది. ఈ మధ్య సురేఖావాణి జోరు తగ్గింది.గతంలో మాదిరి ఆఫర్స్ రావడం లేదు. భర్త మరణంతో ఆమె గ్యాప్ తీసుకున్నారు. తర్వాత లాక్ డౌన్ వచ్చింది. అలా ఓ రెండేళ్లు సురేఖావాణి సిల్వర్ స్క్రీన్ కి దూరం కావడంతో దర్శక నిర్మాతలతో పాటు ప్రేక్షకులు కూడా మర్చిపోయారు. లాభం లేదని సోషల్ మీడియాలో సందడి స్టార్ట్ చేసింది. హాట్ వీడియోలు, ఫొటో షూట్స్ చేస్తూ నెటిజెన్స్ ని ఆకర్షించింది. తనతో పాటు కూతురిని కూడా ఫేమస్ చేసింది. టీనేజ్ నుండే సుప్రీతను ఎంకరేజ్ చేసింది. ఆమెను సోషల్ మీడియా స్టార్ చేసింది. సుప్రీత తనకంటూ ఓ ఇమేజ్ తెచ్చుకుంది.సుప్రీత హీరోయిన్ గా కూడా ఛాన్స్ పట్టేసింది. బిగ్ బాస్ ఫేమ్ అమర్ దీప్ కి జంటగా ఓ రొమాంటిక్ లవ్ ఎంటర్టైనర్ చేస్తుంది. ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటుంది.త్వరలో హీరోయిన్ గా సిల్వర్ స్క్రీన్ పై సందడి చేయనుంది.కాగా సుప్రీత తరచుగా ఫ్యాన్స్ కి టచ్ లో ఉంటుంది. వారితో ఆన్లైన్ చాట్ చేస్తుంది. అభిమానులు అడిగే ప్రశ్నలకు సహనంగా సమాధానం చెబుతుంది. తాజాగా మరోసారి ఆమె ఇంస్టాగ్రామ్ లో ముచ్చటించారు. ఆమెకు ఓ క్రేజీ ప్రశ్న ఎదురైంది. టాలీవుడ్ పెళ్లి కానీ హీరోల్లో ఎవరిని భర్తగా కోరుకుంటున్నావని అడిగారు. ఈ ప్రశ్నకు తడబడకుండా విజయ్ దేవరకొండ పేరు చెప్పింది సుప్రీత. రౌడీ హీరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధం అని చెప్పింది. దాంతో విజయ్ దేవరకొండ మీద సుప్రీతకు అంత ప్రేమ ఉందా? ఆమె క్రష్ విజయ్ దేవరకొండ అని నెటిజెన్స్ ఆశ్చర్యం వ్ వ్యక్తం చేస్తున్నారు




## త్రిష కు బర్త్ డే విషెస్ తెలిపిన 'విశ్వంభర' టీమ్

పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష దాదాపు 18 ఏండ్ల తర్వాత చిరంజీవితో కలిసి ఇందులో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈరోజు త్రిష పుట్టినరోజు. త్రిష 41వ పడిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా చిత్రయూనిట్ బర్త్ డే విషెస్ తెలిపింది. దీనితో పాటు కొత్త పోస్టర్ను పంచుకుంది. ఇక ఈ మూవీ సోషియో ఫాంటసీ బ్యాక్డ్రాప్లో ఈ మూవీ తెరకెక్కుతుండగా యువీ క్రియేషన్స్ సంస్థ సుమారు రూ. 200 కోట్లతో బడ్జెట్తో ఈ సినిమాను నిర్మిస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# కొత్త సినిమా ప్రకటించిన విజయ్ దేవరకొండ

రాజావారు రాణిగారు సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు దర్శకుడు రవికిరణ్ కోలా కిరణ్ అబ్బవరం హీరోగా, రహస్య గోరక్ హీరోయిన్గా 2019లో వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని నమోదు చేసింది. ఇక తన మొదటి సినిమాతోనే సక్సెస్ అందుకున్న కిరణ్, ఇప్పుడు వరుస అవకాశాలతో దూసుకుపోతున్నాడు. ఇదిలా ఉంటే ఈ సినిమా దర్శకుడు రవికిరణ్ కోలా తన కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్స్ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ తన కొత్త ప్రాజెక్ట్ను రవికిరణ్ కోలాతో చేయబోతున్నట్లు గతేడాది సోషల్ మీడియాలో ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వచ్చిన అనంతరం కొత్తగా ఎటువంటి అప్డేట్ను ఇవ్వలేదు. తాజాగా ఈ ప్రాజెక్ట్కు సంబంధించి సాలిడ్ అప్డేట్ను పంచుకుంది. రవికిరణ్ కోలా దర్శకత్వంలో వచ్చే ఈ ప్రాజెక్ట్లో రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా నటించబోతున్నాడు. రూరల్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను మే 09న ప్రకటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ సంబంధించి మరిన్ని అప్డేట్ల కోసం చూస్తూనే ఉండండి అంటూ శ్రీ వెంకటేశ్వర బ్యానర్ సోషల్ మీడియాలో రాసుకోచ్చింది.




# నందమూరి ఫ్యాన్స్కి గుడ్ న్యూస్

## ఎన్టీఆర్ బర్త్డేకి ప్రశాంత్ నీల్ సినిమా అప్డేట్.!

ఆర్ఆర్ఆర్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు యంగ్ టైగర్ ఎన్టీఆర్. ఈ సినిమా వచ్చి 2 ఏండ్లు గడుస్తున్న ఎన్టీఆర్ సినిమా ఒక్కటి కూడా ప్రేక్షకుల ముందుకు రాలేదు. తారక్ ప్రస్తుతం దేవర సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్తో సినిమా చేయబోతున్నాడు. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఎన్టీఆర్ 31గా రానున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే మేకర్స్ పోస్టర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ క్రేజీ కాంబో షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా..ఎప్పుడెప్పుడు సినిమా నుంచి అప్?డేట్లు వస్తాయా అని తారక్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే మూవీకి సంబంధించి సాలిడ్ అప్డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాకు సంబంధించి కొత్త అప్డేట్ మే 20 రానున్నట్లు తెలుస్తుంది. ఆరోజు ఎన్టీఆర్ పుట్టినరోజు. కాగా తారక్ పుట్టినరోజు నాడు అప్డేట్ ఇస్తే.. ఫ్యాన్స్ ఆనందానికి అవధులు ఉండవని చిత్రయూనిట్ ఆలోచిస్తునట్లు సమాచారం. మరోవైపు కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న దేవర సినిమా నుంచి కూడా మే 20తేదీన అప్డేట్ వస్తున్నట్లు తెలుస్తుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com